**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

“ప్రజాప్రశ్న” దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 108, పేజీలు - 08




ఆదివారం,అక్టోబర్ 18, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# రబీ వరి సాగులో తెలంగాణదే సింహభాగం!

## - పంటల మార్పిడి సాధ్యమేనా?

**- నాలుగు రెట్లకు పైగా పెరిగిన వరి సాగు విస్తీర్ణం**

**- నీటి లభ్యతపై ఆందోళనలు.. ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేదెలా?**

**- గిట్టుబాటు ధర, కొనుగోలు భరోసా ఉంటేనే రైతుల్లో మార్పు!**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశ రబీ వరి సాగులో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుండగా.. మరోవైపు నీటి వనరుల పరిరక్షణ, భవిష్యత్తులో సాగునీటి లభ్యతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వరి సాగును తగ్గించి పప్పుధాన్యాలు, నూనెగింజలు, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, దశాబ్ద కాలంగా వరి సాగుపై ఏర్పడిన రైతుల ఆధారపడటాన్ని మార్చడం అంత తేలికైన వ్యవహారం కాదని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### దేశ రబీ వరి సాగులో సగానికి పైగా వాటా

కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 2023--24 రబీ సీజన్‌లో తెలంగాణలో సుమారు 52.02 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ప్రధాన రబీ వరి సాగు రాష్ట్రాల మొత్తం విస్తీర్ణంలో తెలంగాణ వాటా 51.38 శాతంగా నమోదైంది. తమిళనాడు 29.13 లక్షల ఎకరాలతో, ఆంధ్రప్రదేశ్ 14.16 లక్షల ఎకరాలతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ గణాంకాలు దేశ రబీ వరి సాగులో తెలంగాణకు ఉన్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తున్నాయి.

### నాలుగు రెట్లకు పైగా పెరిగిన సాగు

2014--15లో రాష్ట్రంలో 12.23 లక్షల ఎకరాల్లో మాత్రమే రబీ వరి సాగు జరగగా.. 2023--24 నాటికి ఈ విస్తీర్ణం 52.16 లక్షల ఎకరాలకు చేరింది. సాగునీటి సౌకర్యాల విస్తరణ, వరి సాగుపై రైతులకు ఉన్న అనుభవం, ప్రభుత్వ ధాన్యం

2లో..

# చిన్నారులను ఇంటర్నెట్ వాడొద్దు అనలేం

**- అది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అన్న సుప్రీంకోర్టు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలను నెట్‌ను వినియోగించొద్దని అనలేమని, అది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని సుప్రీం ధర్మాసం స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. కేవలం వయస్సును బట్టి పిల్లల ఇంటర్నెట్ వాడకాన్ని పూర్తిగా బ్యాన్ చేయాలనే ఆలోచనను కోర్టు తోసిపుచ్చింది. వయస్సు కారణంగా పిల్లలకు ఇంటర్నెట్ అందుబాటులో లేకుండా చేయడం సరైనదని కాదని అభిప్రాయపడింది. మోసాలు, ఆన్‌లైన్ వేధింపులు నుంచి పిల్లలను రక్షించాలన్న పేరుతో వారికి ఇంటర్నెట్‌ను నిరాకరించలేమని తేల్చి చెప్పింది. ఇదే సమయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 19(1)(ఏ) కింద ఇంటర్నెట్ యాక్సెస్ అనేది

2లో..

# కత్తి ఆంధ్రావాడిది.. కానీ పొడిచేది తెలంగాణోడు

**- సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు కీలక వ్యాఖ్యలు**

**- తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ**

**- దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ**

**- గోదావరి జలాల తరలింపునకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రస్తుత కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎల్ నినో ప్రభావం సాకుగా చూపిస్తూ సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతల నుంచి, తప్పిదాల నుంచి తప్పుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నీటి నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కత్తి ఆంధ్రావాడిది కానీ

2లో..

# విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలి

**- ప్రజలకు భట్టి విక్రమార్క విజ్ఞప్తి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన

2లో..

# క్షేత్రస్థాయిలోకి దిగండి..

## కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

**- స్థానిక సమరానికి చంద్రబాబు వ్యూహం!**

**- 2024 ఎన్నికల ఫలితాలను మించి ఓట్ల శాతమే లక్ష్యం**

**- మహిళలు, బీసీలు, ఎస్సీ, మైనారిటీలకు ప్రాధాన్యం.. టీడీపీ రెండో జాబితా విడుదల**

అమరావతి (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయాన్ని సుస్థిరం చేసుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గత 2024 ఎన్నికల్లో సాధించిన ఓట్ల శాతాన్ని అధిగమించేలా సమష్టిగా పనిచేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు సూచించారు.

గెలుపుపై ధీమాతో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ స్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అమరావతి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల కార్యాచరణపై పలు సూచనలు చేశారు.

### సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం

అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయంతో పాటు పార్టీ కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో 50 శాతానికి పైగా మద్దతు పొందిన వారికి ప్రాధాన్యమిచ్చినట్లు వెల్లడించారు. సోషల్ రీ ఇంజనీరింగ్ ద్వారా జనాభా ప్రాతిపదికన వివిధ సామాజిక వర్గాలకు తగిన అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. టీడీపీ పోటీ చేసే 11 మేయర్ స్థానాలను 11 సామాజిక వర్గాలకు కేటాయించినట్లు వివరించారు.




2లో..

# పులివెందులలో హైటెన్షన్

**- నామినేషన్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ బాహాబాహీ**

**- గాల్లోకి 6 రౌండ్ల కాల్పులు!**



**కడప (ప్రశ్న న్యూస్)** కడప జిల్లా పులివెందులలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అర్బన్ నామినేషన్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా భారీగా చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య రణరంగం నెలకొంది. పరిస్థితి చేయిదాటిపోవడంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పారామిలటరీ బలగాలు, పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఆ తర్వాత టియర్ గ్యాస్ ప్రయోగించి, గాల్లోకి 6 రౌండ్ల కాల్పులు జరిపారు.

### టెన్షన్ టెన్షన్

మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు గడువు సమీపిస్తుండటంతో టీడీపీ, వైసీపీ నాయకులు, వేలాదిమంది కార్యకర్తలు నామినేషన్ కేంద్రం వద్దకు పోటెత్తారు. నామినేషన్ కేంద్రం లోపల టీడీపీ నేతల నామినేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు వేచి ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. అయితే, వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా పోలీసులను తోసుకుంటూ లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. వారిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

2లో..

# తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో కరవు ఛాయలు

**- కేంద్రాన్ని తక్షణ సాయం కోరిన మంత్రి తుమ్మల**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కరవు పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి తక్షణ సహాయం కోరింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి వివరించారు. రైతులకు ఉపశమనం కల్పించేందుకు సూక్ష్మ సేద్యానికి, మధ్యంతర పంటల విత్తనాల పంపిణీకి తక్షణ ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తుమ్మల తెలంగాణలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

కరవు పరిస్థితుల కారణంగా రైతులు పంటల సాగు, దిగుబడులు, పెట్టుబడుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తుమ్మల పేర్కొన్నారు. నీటి లభ్యత తగ్గిన ప్రాంతాల్లో సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల

2లో..

## హైదరాబాద్-విజయవాడ 2లో..

# హైవేపై రద్దీ

**- పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు**



# బిస్కెట్ల తయారీలో పశువుల దాణా

## - తయారీ సంస్థపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠిన చర్యలు!

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**(దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన ‘ప్రియగోల్డ్’ బిస్కెట్ల తయారీలో పశువుల దాణా వినియోగిస్తున్నట్లు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్-ఎస్ఏఐ) సంచలన ప్రకటన చేసింది. ఈ తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందుకు గాను, ప్రియగోల్డ్ తయారీ సంస్థ అయిన ‘సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో లిమిటెడ్’పై ప్రాసిక్యూషన్ ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు శనివారం వెల్లడించింది. ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో కంపెనీ తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో, ‘పశువుల దాణాకు మాత్రమే ఉద్దేశించినది’ అని స్పష్టంగా రాసి ఉన్న తవుడు బస్తాలను అధికారులు కనుగొన్నారు. మనుషుల వినియోగానికి ఏమాత్రం పనికిరాని ఈ తవుడును, బిస్కెట్లలో ఫైబర్ (పీచుపదార్థం) కోసం ముడిసరుకుగా

2లో..

# దాండియా సంబరాల్లో అపశృతి

**- విద్యార్థిని దుర్మరణం.. ఐదుగురి పరిస్థితి విషమం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న ‘సంగమం-2026’ టెక్నికల్ మరియు కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో విషాదం నిండింది. వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ

2లో..

# రబీ వరి సాగులో తెలంగాణదే సింహభాగం!

కొనుగోలు వ్యవస్థపై నమ్మకం ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వరి పంటకు మార్కెట్ అందుబాటుపై రైతులకు కొంత స్పష్టత ఉండటంతో ఇతర పంటల వైపు మళ్లేందుకు వారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

### సూచనలు సరిపోవు.. భరోసా అవసరం

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం గణాంకాల ప్రకారం మార్చి 4 నాటికి రాష్ట్రంలో 57.32 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు నమోదైంది. గత ఏడాది ఇదే సమయానికి ఉన్న 55.36 లక్షల ఎకరాలతో పోలిస్తే ఇది 3.5 శాతం అధికం. వరి సాగును తగ్గించాలన్న సూచనలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతుల మొగ్గు ఇంకా వరి వైపే ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.రైతులకు పప్పుధాన్యాలు, నూనెగింజలు, తక్కువ నీటితో పండే పంటలను పరిశీలించాలని రైతు కమిషన్ సభ్యుడు ఎస్. అన్వేష్ రెడ్డి సూచించారు. అయితే, పంటల మార్పిడికి రైతులకు అవగాహన కల్పించడం ఒక్కటే సరిపోదు. ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధరలు, నాణ్యమైన విత్తనాలు, పంట కొనుగోలుపై స్పష్టమైన హామీ, మార్కెట్ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

### నీటి సంరక్షణతో పాటు రైతు ఆదాయమే కీలకం

భవిష్యత్తులో నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశాలు, ఎల్‌నినో ప్రభావంపై ఆందోళనలు పంటల ప్రణాళికను మరింత కీలకంగా మారుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వరి సాగును ఒక్కసారిగా తగ్గించడం కంటే.. ప్రాంతాలవారీగా నీటి లభ్యతను అంచనా వేసి, రైతులకు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం అవసరం. నీటి వనరుల పరిరక్షణతో పాటు రైతు ఆదాయానికి భంగం కలగకుండా పంటల వైవిధ్యాన్ని పెంచగలిగితేనే ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించే అవకాశం ఉంది. తెలంగాణలో వరి ఆధిపత్యం కొనసాగుతుండటం.. లేక ప్రత్యామ్నాయ పంటలకు ఆదరణ పెరుగుతుందా అన్నది రాబోయే సాగు సీజన్లలో ప్రభుత్వ విధానాలు, మార్కెట్ భరోసాపై ఆధారపడి ఉంటుంది.

# చిన్నారులను ఇంటర్నెట్ వాడొద్దు అనలేం

అందరికీ వర్తిస్తుందని పేర్కొంది.

### ఇంటర్నెట్ నిషేధం పరిష్కారం కాదు..

భద్రత కోసం పిల్లలకు ఇంటర్నెట్ నిషేధం విధించడం సరికాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇక నెట్ వినియోగంపై నిషేధం ఉంటే ఆన్‌లైన్‌లో లైంగిక వేధింపులకు గురైన పిల్లలు ఆ విషయాన్ని బయటకు చెప్పడానికి భయపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. పిల్లల ఇంటర్నెట్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయడానికి బదులుగా వారికి ఆన్‌లైన్ ప్రమాదాలను తగ్గించే భద్రతా చర్యలను అమలు చేయాలని కోర్టు సూచించింది. అలాగే మెరుగైన ప్రైవసీ సెట్టింగ్స్, పేరెంటల్ కంట్రోల్స్ ఉండేలా సోషల్ మీడియా ఖాతాలలో ప్రత్యేక చైల్డ్ మోడ్ తీసుకురావాలని సూచించింది. అదేవిధంగా డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లలో చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్‌ను గుర్తించి వెంటనే తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కాగా భారత దేశంలో పిల్లల ఆన్‌లైన్ సెక్యూరిటీ, డేటా రక్షణ కోసం నాలుగు చట్టాలు ఉన్నాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, పోక్సో యాక్ట్, ఐటీ రూల్స్ 2012, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టాలు ఉన్నాయి. ఈ చట్టాల ప్రకారం ఇంటర్నెట్‌లో పిల్లలకు సంబంధించిన అశ్లీల కంటెంట్‌ను క్రియేట్ చేసినా, పబ్లిష్ చేసినా, వాటిని ఇతరులకు పంపించినా తీవ్ర నేరంగా పరిగణించడం జరుగుతుంది. అలాంటి కంటెంట్‌ను పిల్లలకు పంపించినా, వారిని ప్రలోభాలకు గురి చేసినా కూడా నేరమే అవుతుంది. ఈ నేరం రుజువైతే జరిమానాతో పాటు, జైలు శిక్షలు కూడా ఉంటాయి.

# క్షేత్రస్థాయిలోకి దిగండి..

### మిత్రధర్మం పాటించాలి.. విభేదాలను పరిష్కరించుకోవాలి

క్షేత్రస్థాయిలో టీడీపీతో పాటు కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు సూచించారు. మిత్రధర్మాన్ని పాటిస్తూ భాగస్వామ్య పార్టీల మనోభావాలను గౌరవించాలని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతంతో పాటు కూటమి ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టికెట్లు దక్కని ఆశావహులకు అభ్యర్థుల ఎంపిక వెనుక ఉన్న కారణాలను వివరించి, అసంతృప్తిని తగ్గించాలని సూచించారు. ఒకటి రెండు ప్రాంతాల్లో తలెత్తిన సమస్యలను చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమర్థులైన నాయకత్వం ఎదిగేందుకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

### శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

స్థానిక ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వైఎస్సార్సీపీ వ్యవహరిస్తోందని చంద్రబాబు ఆరోపించారు. ఆ పార్టీ చర్యలు, కుట్రలుగా తాము భావిస్తున్న అంశాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. ఇలాంటి పరిణామాలను సమర్థంగా ఎదుర్కొంటూ కూటమి నేతలంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### టీడీపీ రెండో జాబితాలో మహిళలకు పెద్దపీట

మున్సిపల్ ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను టీడీపీ మరింత వేగవంతం చేసింది. మహిళా సాధికారత, సామాజిక సమీకరణాలు, యువతకు ప్రాధాన్యం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని రెండో జాబితాను విడుదల చేసింది. మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబీదాను ప్రకటించడంతో పాటు మరో 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ అభ్యర్థులను ఖరారు చేసింది. రెండో జాబితాలో మొత్తం 22 మందికి అవకాశం కల్పించగా, వారిలో 18 మంది మహిళలు ఉండటం విశేషం. బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు చెందిన 16 మందికి చోటు కల్పించింది. తద్వారా అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతూకానికి ప్రాధాన్యమిచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇంకా మూడు కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థులతో పాటు 28 మున్సిపాలిటీల చైర్‌పర్సన్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. గుంటూరు, ఒంగోలు, మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం వెలువడాల్సి ఉంది. మిగిలిన మున్సిపల్ స్థానాల్లోనూ అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసేందుకు పార్టీ నాయకత్వం కసరత్తు కొనసాగిస్తోంది.

# విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలి

'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు.గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# కత్తి ఆంధ్రావాడిది..

పొడిచేది తెలంగాణోడు అని హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యమ కాలంలో కేసీఆర్ చెప్పిన మాటలను ఇప్పుడు రేవంత్ రెడ్డి నిజం చేస్తున్నడు అన్నారు. తెలంగాణ నీటి హక్కులను ఆంధ్రాకు తాకట్టు పెట్టి రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నాడని సీఎంపై విమర్శలు గుప్పించారు. ఈ ద్రోహానికి తరతరాలు నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు అని వ్యాఖ్యానించారు.దేవాదుల ప్రాజెక్టులో మొత్తం 10 మోటర్లతో నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా, కేవలం 3 మోటర్లతో మాత్రమే నడిపించి రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యారని హరీష్ రావు మండిపడ్డారు. తెలంగాణ నీటిని వదిలేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా ప్రయోజనం పొందిందని, ఏపీలో తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ ఎలాంటి క్రాప్ హాలిడే పరిస్థితి లేకపోవడానికి రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యమే నిదర్శనమని పేర్కొన్నారు.

### తెలంగాణ నీటి హక్కులపై చంద్రబాబు మరణశాసనం

తెలంగాణ నీటి హక్కులపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరణశాసనం రాస్తున్నారని హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సమ్మక్క సాగర్ నుంచి నదుల అనుసంధానం చేపడితే ఏపీకి నష్టం జరుగుతుందని పేర్కొంటూ చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమ్మక్క సాగర్ నుంచి నాగార్జునసాగర్‌కు నదుల అనుసంధానం చేయాలని ప్రతిపాదించిందని, దానికి కేంద్రంతో పాటు గోదావరి పరివాహక రాష్ట్రాలు కూడా ఆమోదం తెలిపాయని ఈ సందర్భంగా హరీష్ రావు గుర్తుచేశారు. కానీ చంద్రబాబు పోలవరం నుంచి బొల్లేపల్లి రిజర్వాయర్‌ను నింపుతూ 150 టీఎంసీల నీటిని ఏపీ గుప్పిట్లో ఉంచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల తెలంగాణ నీటి ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు.

## తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో కరవు ఛాయలు

సాగుకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులు నష్టాల నుంచి బయటపడేందుకు కేంద్రం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలోనూ కీలక ప్రతిపాదనలు చేశారు. మొక్కజొన్న, జొన్న తదితర పంటలకు 100 శాతం మద్దతు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ధరల మద్దతు పథకం కింద అమలు చేస్తున్న 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించి, రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా రసాయన ఎరువుల ధరలు, వాటిపై అందించే రాయితీలను హేతుబద్ధీకరించాలని మంత్రి తుమ్మల సూచించారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలను విస్తరించడంతో పాటు నీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కరవు ప్రభావిత ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై దృష్టి సారించడం ద్వారా రైతులకు కొంత ఉపశమనం కలిగించవచ్చని పేర్కొన్నారు.మరోవైపు ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు సూచించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సహజ వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి ఎక్కువగా ఉండేదని ప్రస్తుతం అందుకు భిన్నంగా వేడిమి నుంచి రక్షణ పొందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు చేరినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో విద్యుత్‌ను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వ్యవసాయం, తాగునీటి అవసరాలు, విద్యుత్ సరఫరాపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కరవు పరిస్థితులను ఎదుర్కోవడం, రైతులకు అండగా నిలవడం, నీటి వనరులను కాపాడుకోవడం ప్రస్తుతం కీలకమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# పులివెందులలో హైటెన్షన్

### వైసీపీ ఆరోపణలు

ఈ ఘటనపై వైసీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్లు వేసేందుకు వచ్చిన తమ పార్టీ కౌన్సిలర్లను, ఎంపీ అవినాష్ రెడ్డి సహా ఇతర నేతలను పోలీసులు కావాలని అడ్డుకున్నారని ఆరోపించారు. నామినేషన్ కేంద్రం వద్ద టీడీపీ వర్గీయులు అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఘర్షణ అనంతరం అదనపు బలగాలు చేరుకుని ఇరు వర్గాలను తరిమివేసి, కట్టుదిట్టమైన భద్రత మధ్య నామినేషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

### నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ తప్పదు- ఎస్ఈసీ

ఉద్రిక్త పరిణామాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా శనివారం స్పందించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లను ఆదేశించినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచాలని, హైకోర్టు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు కేవలం ముగ్గురు వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండబోవని తేల్చి చెప్పారు. ఎన్నికల విధులు, శాంతిభద్రతలలో అలసత్వం వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేతా స్పష్టం చేశారు.

# హైదరాబాద్-విజయవాడ హైవేపై రద్దీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దసరా పండుగ, వారాంతపు సెలవులు కలిసిరావడంతో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లే రహదారులు, బస్టాండ్లు రద్దీగా మారాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారి 65పై వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లలోనూ ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. పండుగ ప్రయాణాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు పంతంగి టోల్ ప్లాజా వద్ద నెమ్మదిగా కదులుతున్నాయి. దసరా సెలవులకు కుటుంబాలతో కలిసి సొంతూళ్లకు బయలుదేరినవారి వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి రావడంతో రద్దీ పెరిగింది. ఫాస్టాగ్ ఖాతాల్లో తగినంత బ్యాలెన్స్ లేకపోవడం, టోల్ చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలు కూడా వాహనాల నిలిచిపోవడానికి కారణమవుతున్నాయి. దీంతో టోల్ ప్లాజాను దాటేందుకు వాహనదారులు అదనపు సమయం వెచ్చించాల్సి వస్తోంది.రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాల్లోకి వాహనాలను మళ్లిస్తున్నారు. చౌటుప్పల్ పరిధిలోని లక్కారం నుంచి వలిగొండ మీదుగా చిట్యాలకు చేరుకునే మార్గాన్ని వినియోగించేలా దారి మళ్లింపు చర్యలు చేపడుతున్నారు. ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకునే ముందు ట్రాఫిక్ పరిస్థితులను తెలుసుకోవాలని, పోలీసుల సూచనలను పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. టోల్ ప్లాజా వద్ద ఇబ్బందులు తగ్గించేందుకు ఫాస్టాగ్ బ్యాలెన్స్‌ను ముందుగానే తనిఖీ చేసుకోవడం, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించడం మంచిదని వాహనదారులకు సూచిస్తున్నారు.ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని జేబీఎస్, ఎంజీబీఎస్ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. దసరా పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య పెరగడంతో బస్సుల కోసం ప్రయాణికులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రేపు, ఎల్లుండి ప్రయాణాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. దీనికి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం సుమారు 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. నగరంలోని ప్రధాన బస్టాండ్లపై ఒత్తిడి తగ్గించేందుకు శివారు ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి వివిధ గమ్యస్థానాలకు బస్సులు నడుపుతోంది. ప్రయాణికులు తమకు దగ్గరలోని బస్ పాయింట్‌ను ఎంచుకోవడం ద్వారా ప్రధాన బస్టాండ్లకు చేరుకునే ప్రయాణాన్ని తగ్గించుకోవచ్చు. ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. దీంతో పండుగ సమయంలో మహిళా ప్రయాణికులకు అదనపు ప్రయోజనం లభించనుంది. రహదారులపై రద్దీ, బస్టాండ్లలో ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ముందస్తు ప్రణాళికతో బయలుదేరాలని, బస్సుల వివరాలను తెలుసుకుని ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు.

# దాండియా సంబరాల్లో అపశృతి

అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బాధితులను ఎల్బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, అలాగే అదభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీ ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు కూడా చెలరేగడంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

# బిస్కెట్ల తయారీలో పశువుల దాణా

వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు.ఈ ఆరోపణలతో పాటు, సదరు పరిశ్రమలో మరిన్ని లోపాలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తమ ప్రకటనలో పేర్కొంది. పరిశ్రమ ప్రాంగణంలో అపరిశుభ్రత, పురుగుల నివారణ చర్యలు చేపట్టకపోవడం, ముడిసరుకుల నిల్వలో నిర్లక్ష్యం, సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం వంటి అనేక ఉల్లంఘనలను గుర్తించినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, కంపెనీ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశామని, తాజాగా క్రిమినల్ చర్యల్లో భాగంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చామని వివరించింది. సాధారణంగా ధాన్యాల పైపొర అయిన తవుడును ఆహారంలో ఫైబర్ కోసం వాడుతుంటారు. అయితే, మనుషుల కోసం వాడే 'ఫుడ్-గ్రేడ్' ముడిపదార్థాలకు, పశువుల దాణాకు నాణ్యత, భద్రతా ప్రమాణాల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. పశువుల దాణాగా నిర్దేశించిన పదార్థాలను మనుషుల ఆహారంలో కలపడం చట్టరీత్యా తీవ్రమైన నేరం.ఈ చర్యలు కేవలం ప్రియగోల్డ్ సంస్థకే పరిమితం కాలేదు. ఫుల్ క్రీమ్ మిల్క్ శాంపిల్‌లో డిటర్జెంట్ అవశేషాలు గుర్తించినందుకు 'దొడ్ల డెయిరీ'పై, ఎండు ద్రాక్షలో పురుగుమందులు అవశేషాలు ఉన్నందుకు యూఈఐఆర్ ఆర్గానిక్ ఫుడ్స్‌పై కూడా ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అయితే, ఏయే ప్రియగోల్డ్ బిస్కెట్ వేరియంట్లలో ఈ ఉల్లంఘనలు జరిగాయి, ఏ బ్యాచ్‌లకు ఇది వర్తిస్తుంది అనే వివరాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించలేదు. అలాగే, దేశవ్యాప్తంగా ఆ బిస్కెట్లను వెనక్కి తీసుకోవాలని (రీకాల్) కూడా ఇప్పటి వరకు ఆదేశాలు జారీ చేయలేదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజా ఆరోపణలపై సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో సంస్థ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

# పంజాబ్ షూటర్ల వెనుక అసలు సూత్రధారులెవరు.?

## మిథున్‌రెడ్డిని అరెస్టు చేయాలి..
## ఎన్నికలయ్యే వరకు బయట తిరగనివ్వొద్దు
## ఎస్ఈసీకి టీడీపీ బృందం ఫిర్యాదు..
## రాయలసీమలో హింసాత్మక ఘటనలపై చర్యలకు డిమాండ్



అమరావతి(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది. రాయలసీమలో వైకాపా శ్రేణులు దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతాకు ఫిర్యాదు చేసింది. పుంగనూరులో జరిగిన ఘటనలో ఎంపీ మిథున్‌రెడ్డి పాత్రపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, ఇతర రాష్ట్రాల నుంచి ఆయుధాలతో వచ్చిన వ్యక్తుల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలో మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్ తదితరులు ఎస్ఈసీని కలిసి వినతిపత్రం సమర్పించారు.

**నామినేషన్ కేంద్రంలో ఏం జరిగింది.?**

పుంగనూరులో నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉందని వర్ల రామయ్య ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుచరులతో నామినేషన్ కేంద్రంలోకి వచ్చారని, రిటర్నింగ్ అధికారిని బెదిరించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రసార మాధ్యమాల్లో ప్రసారమయ్యాయని, రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీని కోరినట్లు తెలిపారు. మిథున్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆయన కదలికలపై చట్టబద్ధమైన ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఆయన కాన్వాయ్, భద్రతా ఏర్పాట్లపైనా సమీక్ష జరపాలని కోరారు.

**ఇతర రాష్ట్రాల నుంచి ఆయుధాలతో ఎందుకొచ్చారు.?**

పంజాబ్ నుంచి వచ్చినట్లు చెబుతున్న వ్యక్తుల వద్ద తుపాకులు, పిస్తోళ్లు లభించాయన్న అంశాన్ని టీడీపీ నేతలు ప్రధానంగా ప్రస్తావించారు. తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ నుంచి వ్యక్తులను తీసుకొచ్చి రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు కుట్ర జరుగుతోందని వర్ల రామయ్య ఆరోపించారు. పంజాబ్ నుంచి వచ్చినట్లు చెబుతున్న పది మంది షూటర్ల వ్యవహారంపై లోతైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. వారి వద్ద ఆయుధాలు ఎక్కడి నుంచి వచ్చాయి? రాష్ట్రంలోకి ఎవరు తీసుకొచ్చారు? వారి రాక వెనుక ఎవరున్నారు? అసలు వారి లక్ష్యం ఏమిటి? అనే అంశాలను పోలీసులు నిగ్గు తేల్చాలని కోరారు.ఈ వ్యవహారంలో వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల ప్రమేయం ఉందని వర్ల రామయ్య ఆరోపించారు.

# మలక్‌పేట్ ఏరియా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ



మలక్‌పేట్ (ప్రశ్న న్యూస్) రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని విధాన పరిషత్ హాస్పిటల్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మహమ్మద్ మజారుల్లా సూచించారు. శనివారం నాడు మలక్‌పేట్ ఏరియా హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, ఆసుపత్రి నిర్వహణపై సమీక్ష చేశారు. వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది ఎల్లవేళలా రోగులకు అందుబాటులో ఉంటు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరు జాదవ్‌ను ఆదేశించారు. అలాగే ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో నిరంతరం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, రోగులకు అవసరమైన వైద్య సేవలు, మందులు, ఇతర సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని, ఇన్‌పేషెంట్ అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతు, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరు జాదవ్, జిల్లా ఫార్మసీ సూపర్‌వైజర్ కళ్యాణం వీరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# దివ్య మృతిపై సమగ్ర విచారణ జరపాలి

## - శ్రీకర ఆసుపత్రి వైద్యంపై కుటుంబ సభ్యుల డిమాండ్



కాప్రా (ప్రశ్న న్యూస్) యాప్రాల్‌కు చెందిన గండు శ్రీనివాస్ యాదవ్ కుమార్తె గండు దివ్య (21) మృతిపై నిష్పక్షపాత విచారణ జరిపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న దివ్య డెంగ్యూ జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్‌లోని శ్రీకర ఆసుపత్రిలో ఆమెకు అందించిన వైద్య చికిత్స, డిశ్చార్జి చేసిన విధానం, తిరిగి ఆసుపత్రిలో చేర్పించిన అనంతరం తీసుకున్న చర్యలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అధిక జ్వరంతో బాధపడుతున్న దివ్యను తొలుత శ్రీకర ఆసుపత్రిలో చేర్పించగా, డెంగ్యూ జ్వరంగా నిర్ధారించి చికిత్స అందించారు. అక్టోబర్ 13న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అయితే అక్టోబర్ 14న సాయంత్రం సుమారు 6 గంటలకు ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో తిరిగి అదే ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ మరింత చికిత్స అందించడం సాధ్యం కాదని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీంతో మెరుగైన వైద్యం కోసం అక్టోబర్ 15న సాయంత్రం 5 గంటల సమయంలో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.

యశోద ఆసుపత్రిలో చేర్పించిన సమయంలో దివ్య రక్తంలో చక్కెర స్థాయి 10గా ఉందని, రక్తపోటును నమోదు చేయలేని పరిస్థితి ఉందని, రక్తంలో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు తమకు సమాచారం అందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ అక్టోబర్ 16న తెల్లవారుజామున 5.30 గంటలకు దివ్య గుండె ఆగిపోవడంతో మృతి చెందిందని పేర్కొన్నారు. దివ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించడానికి కారణాలేమిటి, వ్యాధి తీవ్రతను సకాలంలో గుర్తించారా, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించారా, డిశ్చార్జి చేసే సమయంలో ఆమె ఆరోగ్య పరిస్థితిని పూర్తిస్థాయిలో అంచనా వేశారా, మరో ఆసుపత్రికి తరలించే నిర్ణయం సరైన సమయంలో తీసుకున్నారా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీకర ఆసుపత్రిలో అందించిన వైద్య చికిత్సకు సంబంధించిన రికార్డులు, పరీక్షల నివేదికలు, డిశ్చార్జి వివరాలను పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. వైద్య నిర్లక్ష్యం జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ కుమార్తెను కోల్పోయిన బాధ వర్ణనాతీతమని, దివ్యను తిరిగి తీసుకురాలేకపోయినా ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై నిజాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దివ్యకు న్యాయం చేయాలనే డిమాండ్‌కు కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రజాస్వామ్యవాదులు, న్యాయం కోరుకునే పౌరులు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికల్లో ఓటమి భయంతోనే

# పాన్ ఇండియా రౌడీయిజం

**తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ నుంచి గూండాలను తెచ్చారు**

**జగన్‌పై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్ర ఆరోపణలు**



మాచర్ల(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్రతరమయ్యాయి. ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇతర రాష్ట్రాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి విధ్వంసాలకు పాల్పడుతున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో జగన్, వైసీపీ నేతలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

**విధ్వంసాలు చేసి.. ప్రత్యర్థులపై నెపమా.?**

దాడులకు పాల్పడి, ఆ తర్వాత వాటిని ప్రత్యర్థి పార్టీలపైకి నెట్టడం వైసీపీ రాజకీయ వ్యూహమని జూలకంటి విమర్శించారు. గతంలో వివేకానందరెడ్డి హత్య కేసు విషయంలోనూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు కూడా అదే తరహా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అయితే, ఇవన్నీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలేనని, వాటిపై సంబంధిత ఆధారాలు, అధికారిక దర్యాప్తు వివరాలు కీలకమని గమనించాలి.

**మూడు రాష్ట్రాల నుంచి వ్యక్తులు వచ్చారంటూ ఆరోపణలు**

తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి దాడులు, వాహనాల ధ్వంసానికి పాల్పడుతున్నారని జూలకంటి ఆరోపించారు. కర్ణాటక, తమిళనాడు నుంచి రాడ్లు, కర్రలతో వ్యక్తులను తీసుకొచ్చారని ఎంపీ మిథున్‌రెడ్డిపై, పంజాబ్ నుంచి తుపాకులు, పిస్టోళ్లతో వ్యక్తులను రప్పించారని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ఈ వ్యవహారాన్ని ఆయన 'పాన్ ఇండియా రౌడీయిజం'గా అభివర్ణించారు.

## అమరావతి ప్రగతిపై మోహన్ యాదవ్‌కు

# చంద్రబాబు వివరణ

**సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ**

**మధ్యప్రదేశ్ సీఎంకు స్వాగతం పలికిన నారా లోకేశ్..**



అమరావతి(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబుతో మోహన్ యాదవ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, అమరావతి నిర్మాణ ప్రణాళికలు, ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి చంద్రబాబు వివరించినట్లు సమాచారం.

**మోహన్ యాదవ్‌కు లోకేశ్ స్వాగతం**

ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్‌కు మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు పరస్పరం పలకరించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ భేటీలో ప్రస్తావించారు.

**'యువగళం' ప్రస్థానాన్ని వివరించిన లోకేశ్**

మంత్రి నారా లోకేశ్ తన పాదయాత్రకు సంబంధించిన విశేషాలను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు వివరించారు. ఈ సందర్భంగా 'యువగళం' పాదయాత్ర పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. పాదయాత్ర సాగిన తీరు, ప్రజలతో మమేకమైన సందర్భాలు, వివిధ ప్రాంతాల్లో ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలకు సంబంధించిన అంశాలను వివరించినట్లు తెలిసింది.

**అభివృద్ధి అంశాలపై మర్యాదపూర్వక చర్చ**

రాష్ట్రాల మధ్య పరస్పర సంబంధాలు, అభివృద్ధి అనుభవాల మార్పిడికి ఇలాంటి మర్యాదపూర్వక భేటీలు వేదికగా నిలుస్తాయి. అమరావతి నిర్మాణం నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వరకు ఆంధ్రప్రదేశ్ ప్రగతి ప్రస్థానాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి వివరించడం ఈ సమావేశంలో ప్రధానాంశంగా నిలిచింది.

## కీసర పోలీసుల ఆధ్వర్యంలో

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకుద**

**ప్రతీకగా బతుకమ్మ సంబరాలు**



కీసర( ప్రశ్న న్యూస్)తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కీసర పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు కీసర గ్రామ పరిధిలో ఈ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.

ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేశారు. అనంతరం కీసర ఇన్‌స్పెక్టర్, పోలీసు సిబ్బంది తెలంగాణ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

## తిరుమలలో గోవింద నామస్మరణ..

# గజవాహనంపై గోవిందుడి వైభవం

**ఉదయం హనుమంత**

**వాహనంపై కోదండరాముడిగా**

**సాయంత్రం పుష్పక విమానంపై**

**గోవర్ధనగిరిధారిగా మలయప్ప**

**రాత్రి గజవాహనంపై**

**జగదభిరాముడి దర్శనం**



తిరుమల(ప్రశ్న న్యూస్) గోవింద నామస్మరణతో సప్తగిరులు పులకించాయి. భక్తజనుల హరినామ సంకీర్తనలు.. కోలాటాల కోలాహలం.. మంగళవాయిద్యాల మధురనాదాలు.. సంప్రదాయ కళారూపాల కనువిందు.. వెరసి తిరుమలలో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల ఆరో రోజు ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. శనివారం ఉదయం హనుమంత వాహనంపై కోదండరాముడిగా, సాయంత్రం పుష్పక విమానంపై గోవర్ధనగిరిధారిగా, రాత్రి గజవాహనంపై శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మూడు వాహనసేవలు స్వామివారి విభిన్న దివ్యరూపాలను ఆవిష్కరించగా.. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ గోవిందుడిని దర్శించుకున్నారు.

**హనుమంతుడిపై కోదండరాముడు.. భక్తికి ప్రతిరూపం.**

ఉదయం నిర్వహించిన హనుమంత వాహనసేవలో శ్రీ మలయప్పస్వామివారు కోదండరాముని అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ధనుస్సు, బాణం ధరించి.. తన పరమభక్తుడైన ఆంజనేయుడిపై విహరిస్తూ దర్శనమిచ్చారు. స్వామివారి దివ్యమంగళ రూపాన్ని చూసి భక్తులు పరవశించారు.

వాహనం ముందు భక్తబృందాలు చెక్కభజనలు, కోలాటాలతో శ్రీరామ నామాన్ని ఆలపించాయి. మంగళవాయిద్యాల నడుమ సాగిన ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాడవీధుల్లో అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

**గురుభక్తికి.. శరణాగతికి ప్రతీక**

హనుమంతుడు అపార పరాక్రమానికి, అచంచలమైన భక్తికి ప్రతీక. శ్రీరాముడిపై ఆయనకున్న నిస్వార్థ భక్తి యుగయుగాలుగా భక్తులకు ఆదర్శంగా నిలుస్తోంది. వేదవిద్యలో నిష్ణాతుడైన ఆంజనేయునిపై శ్రీ మలయప్పస్వామివారు కోదండరాముని రూపంలో విహరించడం ఈ సేవలోని ప్రత్యేకత. భగవంతుడికి, భక్తుడికి మధ్య ఉన్న అనుబంధాన్ని హనుమంత వాహనసేవ చాటిచెబుతుంది. భక్తి, విధేయత, ధర్మనిష్ఠల సందేశాన్ని భక్తులకు అందిస్తుంది.

**కొబ్బరి ఆకులతో పుష్పక విమానం.. గోవర్ధనగిరిధారి వైభవం..**

సాయంత్రం పుష్పక విమానసేవలో రుక్మిణి, సత్యభామ సమేతంగా శ్రీ మలయప్పస్వామివారు గోవర్ధనగిరిధారి శ్రీకృష్ణుని అలంకారంలో దర్శనమిచ్చారు. పుష్పాలతో సుందరంగా అలంకరించిన పుష్పక విమానంపై స్వామివారి దివ్యమంగళ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సేవలో మరో ప్రత్యేక ఆకర్షణ కొబ్బరి ఆకులతో రూపొందించిన పుష్పక విమానం. సుమారు 24 అడుగుల ఎత్తు, 15 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పు, ఒక టన్ను బరువు కలిగిన ఈ విమానాన్ని సంప్రదాయ పుష్పాలతో అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇరువైపులా శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుడు, నాలుగు యుగాలకు చెందిన దేవతామూర్తుల రూపాలను అందంగా రూపొందించారు. తమిళనాడుకు చెందిన నిపుణులు, టీటీడీ ఉద్యానవన విభాగం సిబ్బంది వారం రోజుల పాటు శ్రమించి ఈ పుష్పక విమానాన్ని సిద్ధం చేశారు. చెన్నైకి చెందిన దాత రాంప్రసాద్ భట్ రూపకల్పనకు సహకరించారు.

### గోవర్ధనగిరి ఘట్టం.. ప్రకృతి పరిరక్షణ సందేశం

భాగవతంలో శ్రీకృష్ణుడి గోవర్ధనగిరి ఘట్టానికి విశిష్ట స్థానం ఉంది. ఇంద్రుడి ఆగ్రహం నుంచి గోకులవాసులను, పశువులను కాపాడేందుకు శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని తన చిటికెన వేలిపై ఎత్తినట్లు పురాణగాథలు చెబుతాయి. శరణాగతులను రక్షించే దైవకరుణకు ఈ ఘట్టం ప్రతీకగా నిలుస్తుంది. గోవర్ధనగిరిధారి అలంకారంలో స్వామివారి దర్శనం భక్తులకు ఆ ఘట్టాన్ని స్మరింపజేసింది. పుష్పక విమానసేవ నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాహనసేవల అనంతరం స్వామి, అమ్మవార్లు సేదతీరే సంప్రదాయంలో భాగంగా ఈ సేవ నిర్వహిస్తారు.

**వాహనసేవల్లో ప్రముఖులు**

హనుమంత, పుష్పక విమాన, గజవాహనసేవల్లో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి సేవలను తిలకించారు.

# మాయమవుతున్న సంప్రదాయాలు

**- గతి తప్పుతున్న బతుకమ్మ ఆటా పాట**



**హైదరాబాదు (ప్రశ్న న్యూస్)** ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించి ప్రకృతిని ఆరాధించే పూల పండగ బతుకమ్మ సంబరాలు. తెలంగాణ ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక. పాట, ఆటల కలయికే బతుకమ్మ పండుగ. బతుకమ్మ పండుగ వస్తోందంటే తెలంగాణ పల్లెలో పండగ వాతావరణం కనిపిస్తుంది. ఆడపిల్లలు పుట్టింటికి ఎప్పుడెప్పుడు వెళ్దామా అని ఎదురు చూసే సందర్భం. తోటి స్నేహితులు, బంధువులతో కలిసి బతుకమ్మ ఎప్పుడు ఆడుకుందామా అని ఎదురు చూసు ఆతృతే బతుకమ్మ పండగ ప్రత్యేకత. సంవత్సరం అంతా ఆడపడుచులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే అందమైన రంగు రంగుల పూల పండగ ఈ బతుకమ్మ పండగ

**బతుకమ్మ అంటే ఏంటి**

బతుకమ్మ అంటే ఒక పండుగ కాదు, ఇది తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతా ప్రేమానురాగాల ప్రతిబింబం. గ్రామాలలో బతుకమ్మ పండుగకు తెల్లవారుజామునే పూలను సేకరించడం ఒక పెద్ద బాధ్యత. తంగేడు పూలు, గునుగు పూలు, కట్ల పూలు, చామంతి, బంతి, గన్నేరు ఇలా ఎన్నెన్నో రకాల పువ్వులతో బతుకమ్మను అందంగా పేర్చుకుని ఆడుకుంటారు. గునుగు పూలు తెల్లగా ఉంటాయి. వాటిని రంగు రంగుల నీళ్ళలో ముంచి పలు రంగుల్లోకి మారుస్తారు. ఎన్ని రకాల పూలున్నా తంగేడు పూలకే ప్రాధాన్యం. పసుపు వర్ణంలో బంగారంలా మెరిసిపోతు ఉంటాయి. పసుపు రంగు ఐదవతనానికి సంకేతం.బతుకమ్మను పేర్చడం ఒక కళ. తూర్పు లేదా ఉత్తర దిశకు అభిముఖంగా కూర్చొని బతుకమ్మను పేర్చుతారు. పెద్ద పళ్ళెంలో గుమ్మడి ఆకులను పరచి, ఆ ఆకులపై పసుపు, కుంకుమలు, అక్షితలు చల్లి వలయంగా తంగేడు పూలను ముందుగా అమరుస్తారు. ఇలా వివిధ రంగుల పూలను ఒక వరుస మీద మరొక వరుసగా పెడుతు గోపురంలా పేరుస్తారు

**పెద్ద బతుకమ్మ ప్రక్కన చిన్న బతుకమ్మ.**

పెద్ద బతుకమ్మ పక్కనే చిన్న బతుకమ్మను పేర్చి ప్రక్క ప్రక్కన ఉంచుతారు. దానిపై తమలపాకులో కాని చిక్కుడు ఆకులో కాని పసుపు ముద్ద గౌరమ్మను పెట్టి మధ్యన నొక్కి రెండు శిఖరాలుగా చేస్తారు. ఇవి శివ పార్వతులకు, అర్థనారీశ్వర తత్వానికీ ప్రతీకలు. వాటికి వస్త్రాలుగా పత్తితో అలంకరించి పూజ గదిలో ఉంచి ధూప దీప నివేదనలు సమర్పిస్తారు. తమ కుటుంబాలు సుఖ సంతోషాలతో సంపదతో వర్ధిల్లేలా అనుగ్రహించాలని ప్రార్థిస్తారు. తరువాత బంధు మిత్రులతో పాటు బతుకమ్మలను మధ్యలో ఉంచి వయోబేధం లేకుండా బతుకమ్మల చుట్టూ తిరుగుతు పాటలు పాడుతు ఆడుతారు.ఆ తర్వాత బతుకమ్మలను గంగమ్మ ఒడిలో నిమర్జనం చేసి గౌరమ్మను మంగళ సూత్రాలకు పూసుకుని వారి కుటుంబాలను చల్లంగా చూడమని వేడుకుంటారు. అనంతరం తెచ్చిన నైవేద్యాలను ఒకరికి ఒకరు పంచుకొని ఆరగిస్తారు.

**కనుమరుగవుతున్న సాంప్రదాయాలు**

ప్రస్తుత కాలంలో అనాదిగా వస్తున్న సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. గతంలో బతుకమ్మ ఆట, పాటకు ఓ ప్రత్యేకత ఉండేది. రోజు రోజుకు ఆట పద్ధతిని మార్చుకొని వెర్రిపుంతలు తొక్కుతుంది. బతుకమ్మ పండగ ఆట, పాటలకు ఆధునిక పద్దతులు రుద్దడంతో బతుకమ్మ పండుగ ప్రతిష్ట మసకబారుతుందని చెప్పవచ్చు. సంప్రదాయ పాటలకు భిన్నంగా సినిమా పాటలు, ఆటలతో చిత్ర విచిత్రమైన స్టెప్పులతో సనాతన సాంప్రదాయాలకు స్వస్తి చెప్పడం గమనార్హం, మన సాంప్రదాయం, సంస్కృతిని విదేశీయులు సైతం ఆకర్షితులవుతుడగా, మనం వాటిని పక్కదారి పట్టిస్తున్నామా అన్న భావన కలుగుతుంది. బతుకమ్మలో తంగేడు, గునుగు పూలకే అధిక ప్రాధాన్యత ఇస్తారు. చేలల్లో గునుగు, గడ్డి పూలు తీసుకొచ్చి వాటిని రంగుల్లో ముంచి బతుకమ్మను పేర్చుతారు. సద్దుల బతుకమ్మ రోజు మగవాళ్లంతా చేను చెలకా, అడవిలోకి పోయి తంగేడు, టేకు, గునుగు పూలను సేకరించడం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మారుతున్న పరిస్థితులతో పొలాలు, చేనుగట్లపై పూల చెట్లు మాయమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తంగేడు పువ్వు కనిపించని పరిస్థితి ఏర్పడింది. గునుగు పువ్వును ప్రస్తుతం మార్కెట్‌లో కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొన్నాయి.

**కానరాని సిబ్బిలు**

గడ్డిపూలు, కట్ల పూలు, బంతులు, చేమంతులు, బొండు మల్లెలు, టేకు పువ్వులు, ఇసుక బంతులు, పట్టు కుచ్చులు, సీతమ్మజడలు, గుమ్మడి పూలు ఇలా తీరొక్క పూలు గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోను ఇంటి పెరట్లలో దర్శనమిచ్చేవి. మారుతున్న కాలంలో నేడు మార్కెట్‌కు వెళ్లి పూలు కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. ఇదిలావుండగా పట్టాలు, నగరాల్లో పేపర్ పూల బతుకమ్మలతో పండుగను జరుపుకుంటుండటం గమనార్హం. బతుకమ్మ పండుగలో గౌరమ్మ కోసం ప్రత్యేకంగా వెదురుతో సిబ్బిని చేయించుకునేవారు. వెదురు సిబ్బి లేకుండా బతుకమ్మ లేదు అనేంతగా వాటి అవసరం ఉండేది. వెదురు సిబ్బిలోనే తీరోక్క పూలను పేర్చి బతుకమ్మను తయారు చేసేవారు. అయితే నేడు సిబ్బి స్థానంలో ప్లాస్టిక్, పేపర్ ప్లేట్లు రావడంతో బతుకమ్మ వేడుకల ప్రతిష్టకు భంగం వాటిల్లితుందని పలువురు ఆరోపిస్తున్నారు.

**మాయమవుచున్న సంప్రదాయాలు**

దశాబ్ద కాలం క్రితం వరకు పల్లెల్లో మహిళలు బతుకమ్మ పాటలు పాడుతుంటే తోటి మహిళలంతా చప్పట్లతో పాటను అనుకరిస్తు బతుకమ్మల చుట్టు తిరుగుతు ఆడేవారు. దీంతో బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తు ప్రత్యేకమైన తెలంగాణ సంస్కృతిని ఆవిష్కరిస్తుండేవి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో ఆడబిడ్డల కష్ట సుఖాలు, ప్రేమలు, స్నేహం, బంధుత్వాలు ఉట్టిపడేవి. ప్రస్తుతం ఆ పాటలు క్రమేపి కనుమరుగయ్యాయి. ఏ వైపు చూసినా డిజే పాటల చప్పుళ్లు, కోలాటాల నడుమ బతుకమ్మను ఆడుతున్నారు. ఆనాటి కాలంలో తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగలో సద్దుల బతుకమ్మ అత్యంత ప్రత్యేకమైనది.

ఆ రోజు పెద్దగా బతుకమ్మలు పేర్చడమే కాకుండా ప్రత్యేకమైన పిండి వంటకాలు, తీపి వంటలు, సద్దులు చేసి బతుకమ్మ సంబరాల్లో ఒకరికొకరు పంచుకొనేది. కొత్తగా వచ్చిన ధాన్యాలను దోరగా వేయించి వాటిని చక్కర లేదా బెల్లంతో కలిపి పిండిలా దంచి గౌరమ్మకు ప్రసాదంగా సమర్పించి వాటిని ఒకరికొకరు పంచుకునే వారు. ఈ పంపిణీ వెనుక కూడా శాస్త్రీయత దాగి ఉంది. ఆ సద్దులన్నీ చిరు ధాన్యాలతో చేసినవే.

అవి ఆరోగ్యానికి మంచి చేసేవి. ప్రస్తుతం ఆ సంస్కృతి పోయి స్వీట్లు పంచుకునే పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా వేల సంవత్సరాల చరిత్ర కలిగి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా బతుకమ్మ పండుగను మన పండుగగా జరుపుకొని రాబోయే తరాలకు వారసత్వంగా అందించాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని, ప్రభుత్వం కూడా ఈ దిశగా అడుగులు వేయాలని పలువురు కోరుతున్నారు.

# సిరుల తల్లి.. శ్రీ మహాలక్ష్మి

## ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దివ్య అలంకారం

**అష్టైశ్వర్య ప్రదాయినిగా జగన్మాత దర్శనం..**

**అమ్మవారి కటాక్షం కోసం పోటెత్తిన భక్తజనం**



విజయవాడ(ప్రశ్న న్యూస్) సిరిసంపదలకు చిరునామా.. సౌభాగ్యాలకు ఆలవాలం.. సకల శుభాలకు మూలం.. ఆ జగన్మాత శ్రీ మహాలక్ష్మీదేవి, ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడో రోజైన శనివారం కనకదుర్గమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కొండపై మార్మోగిన అమ్మవారి నామస్మరణలు, ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. సిరిసంపదలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని జగన్మాతను వేడుకుంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

### ఐశ్వర్యానికి ప్రతిరూపం.. మహాలక్ష్మి

హిందూ ధర్మ సంప్రదాయంలో మహాలక్ష్మీదేవి అంటే కేవలం ధనసంపదకు మాత్రమే ప్రతీక కాదు. జీవనాన్ని సుసంపన్నం చేసే సకల శుభాలకు ఆమె ప్రతిరూపం. ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, విజయలక్ష్మి వంటి అష్టలక్ష్మీ స్వరూపాల్లో భక్తులు అమ్మవారిని ఆరాధిస్తారు. సంపదతో పాటు ఆరోగ్యం, ధైర్యం, విజ్ఞానం, కుటుంబ సౌఖ్యం, విజయాన్ని ప్రసాదించే తల్లిగా కొలుస్తారు.
మహాలక్ష్మీ అలంకారంలో కనకదుర్గమ్మను దర్శించుకోవడం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది. అమ్మవారి కరుణాకటాక్షాలు తమ కుటుంబాలపై ఉండాలని, ఆర్థిక ఇబ్బందులు తొలగి జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. సంపద అంటే కేవలం ధనం మాత్రమే కాదని.. మనశ్శాంతి, ఆరోగ్యం, కుటుంబ ఐక్యత, సంతృప్తికరమైన జీవనం కూడా నిజమైన ఐశ్వర్యాలేననే ఆధ్యాత్మిక సందేశాన్ని మహాలక్ష్మీ స్వరూపం గుర్తుచేస్తుంది.

### రైతుకు పంట.. వ్యాపారికి లాభం!

గ్రామీణ జీవనానికి వ్యవసాయం వెన్నెముక. రైతుకు పాడిపంటలు సమృద్ధిగా పండితేనే కుటుంబాలు సుభిక్షంగా ఉంటాయి. వ్యాపారాలు వృద్ధి చెందితేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రతి ఇంటా అన్నపూర్ణత, ఆనందం వెల్లివిరిస్తేనే సమాజం సంతోషంగా ఉంటుంది. ఈ ఆకాంక్షలన్నింటికీ ప్రతిరూపంగా భక్తులు మహాలక్ష్మీదేవిని ఆరాధిస్తారు.అమ్మవారి సన్నిధిలో భక్తులు తమ వ్యక్తిగత కోరికలతో పాటు సమాజ శ్రేయస్సును కూడా కాంక్షిస్తున్నారు. రైతులకు మంచి దిగుబడులు రావాలని, వ్యాపారులు అభివృద్ధి చెందాలని, నిరుద్యోగులకు ఉపాధి లభించాలని, పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నిండాలని జగన్మాతను వేడుకుంటున్నారు. సంపద కొందరికే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికీ సంతోషాన్ని పంచాలనే భావన మహాలక్ష్మీ ఆరాధనలో అంతర్లీనంగా కనిపిస్తుంది.

### భక్తిభావంలో ఇంద్రకీలాద్రి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రోజుకో రూపంలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారు. ఏడో రోజు మహాలక్ష్మీ అలంకారం భక్తుల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. అమ్మవారి నామస్మరణలు, ప్రార్థనలు, మొక్కుబడులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.
శక్తి ఆరాధనలో ప్రతి అలంకారానికి ఒక ప్రత్యేక అంతరార్థం ఉంటుంది. మహాలక్ష్మీ స్వరూపం సంపదను సద్వినియోగం చేసుకోవాలని, కష్టపడి సంపాదించిన దానిని ధర్మబద్ధంగా వినియోగించాలని, ఇతరులకు సహాయం చేయడంలోనూ ఆనందాన్ని వెతుక్కోవాలని సూచిస్తుంది. దైవభక్తితో పాటు దయ, దానం, ధర్మం, కష్టపడే తత్వం ఉన్నప్పుడే జీవితం నిజమైన సిరిసంపదలతో నిండుతుందనే సందేశాన్ని అందిస్తుంది.

### సిరుల తల్లి కటాక్షం కోసం.

శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న జగన్మాతను చూసి భక్తులు తన్మయత్వం చెందుతున్నారు. తమ కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని, కష్టాలు తొలగి మంచి రోజులు రావాలని, జీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలని ప్రార్థిస్తున్నారు. దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై వెల్లివిరుస్తున్న ఈ భక్తి వైభవం విజయవాడ ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని మరోసారి చాటుతోంది.

# పులుల సంరక్షణకు మరింత బలం

**పవన్ కల్యాణ్‌తో మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ భేటీ**

**నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో గౌర్ పునఃప్రవేశంపై చర్చ**

**త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానన్న ఉప ముఖ్యమంత్రి**



మంగళగిరి(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల మధ్య అభివృద్ధి, అటవీ సంరక్షణ అంశాలపై కీలక చర్చ జరిగింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్--2.0లో పాల్గొనేందుకు విజయవాడకు వచ్చిన మోహన్ యాదవ్.. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఆయనకు ఉప ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికారు.

**పులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి**

ఈ భేటీలో రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతోపాటు అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై చర్చించారు. ముఖ్యంగా నాగార్జునసాగర్--శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్) పరిధిలో పులుల సంరక్షణ చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. పులుల ఆవాసాల పరిరక్షణ, జీవవైవిధ్యాన్ని కాపాడే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే, నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో గౌర్ (అడవి దున్నలు) పునఃప్రవేశానికి సంబంధించిన ఒప్పందాన్ని త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని కోరారు. వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సమతుల్యతకు సంబంధించి ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయంతో ముందడుగు వేయడంపై చర్చ జరిగినట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది.త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా తెలిపారు.

**సంప్రదాయ కళాకృతులతో సత్కారం**

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను పవన్ కల్యాణ్ ఉప్పాడ పట్టు శాలువాతో సత్కరించారు. రాష్ట్రంలోని చేనేత, హస్తకళా సంపదకు ప్రతీకగా నిలిచే ప్రత్యేక కానుకలను అందజేశారు. శ్రీరామ పట్టాభిషేకం కొండపల్లి కళాకృతి, శ్రీకాళహస్తి పెన్ కలంకారీ కళాకారులు రూపొందించిన శ్రీ దుర్గాదేవి చిత్రపటం, అరకు కాఫీని బహూకరించారు.దీనికి ప్రతిగా మోహన్ యాదవ్.. పవన్ కల్యాణ్‌కు శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రతిమను, జ్యోతిర్లింగ క్షేత్రం నుంచి తీసుకువచ్చిన ప్రసాదాన్ని అందజేశారు.రాష్ట్రాల మధ్య పరస్పర సంబంధాలు, అభివృద్ధి అంశాలతోపాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలు ఈ భేటీలో ప్రాధాన్యం పొందాయి. సంప్రదాయ కళాకృతుల పరస్పర బహూకరణతో సమావేశం సాంస్కృతిక ప్రాధాన్యాన్నీ సంతరించుకుంది.

# మా సేవలు ఆకాశంలో.. మా బతుకులు అగాధంలో

## తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో పార్ట్‌టైమ్ అధ్యాపకుల దుస్థితి

**దశాబ్దాల సేవలకు భరోసా ఏదీ? ఉద్యోగ భద్రత కల్పించి, నియామకాల్లో న్యాయం చేయాలి ప్రభుత్వం స్పందించేది ఎప్పుడు.? మా జీవితాలు బాగుపడేది ఎన్నడు.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) యూనివర్సిటీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల జీవితాలు మాత్రం అగాధంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. దశాబ్దాలుగా సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత కరువై, చాలీచాలని వేతకాలతో కుటుంబాలను పోషించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్థితి నెలకొంది. ఒకవైపు విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేస్తుంటే, మరోవైపు తమ భవిష్యత్తుపై భరోసా లేకుండా బతుకులు వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ జీవన్ పాలడుగు, డాక్టర్ కాటేపాగ యుగంధర్, డాక్టర్ వీరు యాదవ్, డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి,
డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంపత్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులు పర్మనెంట్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వారికి మాత్రం అతి తక్కువ వేతనాలు చెల్లించడం అన్యాయమని పేర్కొన్నారు. విద్యాబోధనతో పాటు యూనివర్సిటీల విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కీలకంగా వ్యవహరిస్తున్న తమ సేవలకు తగిన గుర్తింపు, గౌరవం, ఆర్థిక భద్రత లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### 12 నెలలు పని.. ఆరు నెలలకే జీతమా.?

పార్ట్‌టైమ్ అధ్యాపకులు ఏడాది పొడవునా, అంటే 12 నెలలు పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ కేవలం ఆరు నెలలకు మాత్రమే వేతనాలు పొందుతున్నారని ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన నెలల్లో కుటుంబ ఖర్చులు, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, ఇతర నిత్యావసరాలను ఎలా తీర్చుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యావ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న అధ్యాపకుల జీవితాలే ప్రశ్నార్థకంగా మారడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీతో పాటు పార్ట్‌టైమ్ అధ్యాపకుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాల అనుభవం కలిగిన అధ్యాపకులను విస్మరించి, వారి సేవలకు విలువ ఇవ్వకుండా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, నియామక ప్రక్రియలో వారి అనుభవానికి తగిన ప్రాధాన్యత ఇచ్చినప్పుడే నిజమైన న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

### హామీలు కాదు.. ఆచరణలో న్యాయం కావాలి

పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యలను ఇకనైనా ప్రభుత్వం విస్మరించకుండా, వారి న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు కోరారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తమ శ్రమను, సమయాన్ని వెచ్చిస్తున్న అధ్యాపకులకు కనీస ఆర్థిక భద్రత లేకపోవడం విచారకరమన్నారు. విద్యను బలోపేతం చేయాలంటే ముందుగా విద్యాబోధన చేస్తున్న అధ్యాపకుల జీవితాల్లో భరోసా నింపాలని సూచించారు.మా సేవలు ఆకాశంలో మా బతుకులు అగాధంలో అన్న పరిస్థితికి ముగింపు పలకాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు స్పష్టం చేశారు. పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, 12 నెలల వేతనాలు, ఉద్యోగ భద్రత, నియామకాల్లో తగిన ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### పార్ట్‌టైమ్ అధ్యాపకుల ప్రధాన డిమాండ్లు

1. 12 నెలలకు కన్సాలిడేటెడ్ పే చెల్లించాలి. ఏడాది పొడవునా పనిచేసే అధ్యాపకులకు ఆరు నెలలకే వేతనాలు చెల్లించే విధానాన్ని సరిచేయాలి.
2. ఉద్యోగ భద్రత కల్పించాలి. దశాబ్దాలుగా సేవలందిస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి.
3. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో అనుభవానికి వెయిటేజీ ఇవ్వాలి. పార్ట్‌టైమ్ అధ్యాపకుల బోధనా అనుభవాన్ని గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలి.
4. దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థిని ఇంటర్వ్యూలకు అనుమతించాలి. అర్హులైన అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలి.
5. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇప్పటికే విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న వారి అనుభవం, అర్హతలను నియామక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవాలి.

# కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

**రూ.2.28 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు**

**రూ.7 లక్షల నగదు, 60 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం**

**ఇల్లు, కార్యాలయం సహా ఆరు ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు**

**గతంలో లంచం కేసులోనూ పట్టుబడిన సీఐ ఆంజనేయులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరో అవినీతి అధికారిపై కొరడా ఝళిపించింది. మేడ్చల్-మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అర్కపల్లి అంజనేయులుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. అక్రమ మార్గాలు, అవినీతి పద్ధతుల ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో శనివారం (17-10-2026) ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, సన్నిహితులు, బినామీలకు సంబంధించిన మరో నాలుగు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

### రూ.1.20 కోట్ల విలువైన స్థిరాస్తుల గుర్తింపు

సోదాల్లో పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. సరూర్‌నగర్ పరిధిలోని లింగోజిగూడలో 150 చదరపు గజాల చొప్పున ఉన్న రెండు ప్లాట్లు, వాటిపై పాత ఇల్లు కలిపి రూ.30 లక్షలుగా అంచనా వేశారు. ఎల్‌బీనగర్‌లోని మాన్సూరాబాద్ సీఆర్ ఎన్‌క్లేవ్‌లో 240 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న పాత ఇంటి విలువ రూ.40 లక్షలుగా పేర్కొన్నారు. అలాగే పెరూర్ గ్రామంలో 180 చదరపు గజాల్లో నిర్మాణంలో ఉన్న ఇంటి విలువ రూ.50 లక్షలుగా గుర్తించారు. మిర్యాలగూడ పరిధిలోని హాలియాలో రెండు ఎకరాల వ్యవసాయ భూమిని సుమారు రూ.80 లక్షలుగా అంచనా వేశారు. అయితే ఈ ఆస్తుల మార్కెట్ విలువ అధికారిక అంచనాల కంటే చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ ప్రెస్‌నోట్‌లో పేర్కొంది. అంతేకాకుండా, హాలియాలో మరికొంత వ్యవసాయ భూమిని కూడా అధికారి కొనుగోలు చేసినట్లు తదుపరి విచారణలో వెల్లడైందని తెలిపింది.

### నగదు, బంగారం, కారు స్వాధీనం

సోదాల్లో రూ.7 లక్షల నగదుతో పాటు సుమారు 60 తులాల బంగారు ఆభరణాలను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలుగా పేర్కొన్నారు. మారుతి విటారా బ్రెజ్జా కారును సుమారు రూ.6.50 లక్షలుగా అంచనా వేశారు. అదనంగా రూ.10 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తించారు. ఇతర ఆస్తులపై కూడా ఏసీబీ అధికారులు పరిశీలన కొనసాగిస్తున్నారు.

### గతంలోనూ లంచం కేసులో అరెస్టు

కీసర పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలోనే అంజనేయులు లంచం కేసులో పట్టుబడినట్లు ఏసీబీ వెల్లడించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 16న అధికారికంగా అనుకూల నిర్ణయం తీసుకునేందుకు రూ.8 లక్షలు డిమాండ్ చేసి, తన సబార్డినేట్ ఎస్ఐ డి. గణేందర్ రెడ్డి ద్వారా రూ.5 లక్షలు స్వీకరించినట్లు పేర్కొంది. ఈ కేసులో సెప్టెంబర్ 17న అంజనేయులును అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో ఉన్నట్లు ప్రెస్‌నోట్‌లో తెలిపింది.

### రూ.2.28 కోట్లకు పైగా మొత్తం ఆస్తులు

ప్రస్తుత ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అంజనేయులుకు సంబంధించిన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.2,28,50,000గా, అంటే రూ.2 కోట్ల 28 లక్షల 50 వేలుగా అంచనా వేసినట్లు ఏసీబీ వెల్లడించింది. ఈ కేసులో తదుపరి విచారణ నిమిత్తం ఆయనను పీటీ వారెంట్‌పై కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు తెలిపింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది. మరిన్ని ఆస్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఏసీబీ పేర్కొంది.

# అభివృద్ధిని చూసి ఓటేయండి

**- బుచ్చిలో కూటమి జోరు.. చైర్‌పర్సన్**

బుచ్చిరెడ్డిపాళెం(ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల వేళ బుచ్చిరెడ్డిపాళెంలో రాజకీయ సందడి మొదలైంది. అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ప్రజల్లోకి వెళ్తామని కూటమి నేతలు ప్రకటించారు. గత రెండున్నరేళ్లలో పట్టణంలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని బేరీజు వేసుకొని ఓటు వేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా కూటమి తరఫున ఎంపికైన దొడ్ల విజయలక్ష్మి శనివారం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.

**మార్పును గమనించాలి.. అభివృద్ధిని అంచనా వేయాలి.**

నామినేషన్ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. రెండున్నరేళ్ల క్రితం బుచ్చిరెడ్డిపాళెం పరిస్థితులు ఎలా ఉన్నాయి? ప్రస్తుతం ఎలాంటి మార్పు వచ్చింది? ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందుతున్నాయి? అనే అంశాలను పరిశీలించి ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. పట్టణంలో కనిపిస్తున్న మార్పును ప్రజలు గమనించాలని, మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మితో పాటు కౌన్సిలర్ అభ్యర్థులందరికీ మద్దతు ఇవ్వాలని కోరారు. కూటమి అభ్యర్థులు ప్రజల ఆదరణతో విజయం సాధిస్తారనే ధీమా వ్యక్తం చేశారు.

**28 వార్డులపై కూటమి గురి**

బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలోని మొత్తం 28 వార్డుల్లో కూటమి అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటులో భాగంగా బీజేపీకి మూడు, జనసేనకు మూడు వార్డులు కేటాయించినట్లు తెలిపారు. సీనియర్ నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు.
నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో సమష్టిగా ముందుకు సాగడమే లక్ష్యమని స్పష్టం చేశారు.



**వేమిరెడ్డి దంపతులకు విజయలక్ష్మి కృతజ్ఞతలు**

చైర్‌పర్సన్ అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు ముందుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతుల నివాసానికి వెళ్లిన దొడ్ల విజయలక్ష్మి వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని చెప్పారు.
ప్రజలు కూటమికి మద్దతు తెలపాలని కోరారు.అభివృద్ధి, సంక్షేమం కేంద్రంగా సాగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# విజయవాడలో జాతీయ సరస్ మేళా సందడి

## 600 స్టాళ్లు.. 1,500 మంది మహిళా పారిశ్రామికవేత్తలు

### దసరా వేళ సందర్శకుల తాకిడి..

### ఇప్పటికే రూ.2 కోట్లకు పైగా వ్యాపారం




విజయవాడ(ప్రశ్న న్యూస్) దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, చేనేత వస్త్రాలు, హస్తకళలు, ప్రాంతీయ వంటకాలకు విజయవాడ వేదికగా నిలిచింది. పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 1,500 మంది మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మొత్తం 600 స్టాళ్లు, 50 లైవ్ ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేయడంతో ప్రాంగణం సందడిగా మారింది. ప్రతిరోజూ 40 వేల నుంచి 50 వేల మందికి పైగా సందర్శకులు వస్తుండగా.. ఇప్పటివరకు రూ. 2 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

#### మహిళల ఉత్పత్తులకు జాతీయ వేదిక

భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధుల మిషన్ (సెర్ప్) సహకారంతో ఈ మేళాను నిర్వహిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. చేనేత వస్త్రాలు, హస్తకళలు, సహజ ఆహార ఉత్పత్తులు సహా పలు రకాల వస్తువులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వంటకాలను రుచిచూసేందుకు ప్రత్యేకంగా 50 లైవ్ ఫుడ్ స్టాళ్లతో ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు.

#### మహిళలకు ఉచితంగా స్టాళ్లు, వసతి

దేశ రాజధాని ఢిల్లీ తర్వాత తొలిసారిగా విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాకు విశేష స్పందన లభిస్తోందని సెర్ప్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, కళాకారులకు 600 స్టాళ్లను ఉచితంగా కేటాయించడంతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలను ఉచితంగా కల్పించినట్లు వివరించారు. దీనివల్ల మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడంతో పాటు, వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు అవకాశం లభిస్తోందన్నారు

#### .బ్రాండింగ్ నుంచి ఎగుమతుల వరకు శిక్షణ

మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను నాణ్యమైన బ్రాండ్లుగా అభివృద్ధి చేసుకుని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్ఐఆర్డీ (NIRDPR) నిపుణులు, జాతీయ స్థాయి నిపుణుల సహకారంతో బ్రాండింగ్, ప్యాకేజింగ్, ఎగుమతి మార్కెటింగ్, వాల్యూ చైన్ మేనేజ్‌మెంట్ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. మీట్ అండ్ గ్రీట్ పెవిలియన్ ద్వారా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు

#### .ఆకట్టుకుంటున్న 'లఖ్‌పతి దీదీ' పెవిలియన్

మహిళా పారిశ్రామికవేత్తల విజయగాథలను ప్రజలకు పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన 'లఖ్‌పతి దీదీ' పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మహిళలు తమ ఉత్పత్తులను ఎలా తయారు చేస్తున్నారో ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు డెమో పెవిలియన్ ఉపయోగపడుతోంది. మరోవైపు ప్రభుత్వ పథకాలు, మహిళా సంఘాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించేందుకు కన్వర్జెన్స్ పెవిలియన్‌ను ఏర్పాటు చేశారు.సందర్శకులకు అవసరమైన సమాచారం అందించేందుకు గేట్ నంబరు 2 వద్ద వెల్‌కమ్ పెవిలియన్‌లో హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్, లాస్ట్ అండ్ ఫౌండ్ కేంద్రాలను అందుబాటులో ఉంచారు. వివిధ రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహార వైవిధ్యం ఒకేచోట కనిపిస్తుండటంతో ఈ మేళా 'మినీ ఇండియా'ను తలపిస్తోంది.

#### గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చేయూత

గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించడంతో పాటు, వారి ఆదాయాన్ని పెంపొందించేందుకు సరస్ మేళా దోహదపడుతోందని ఎన్ఐఆర్డీ అడిషనల్ డైరెక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో సందర్శకుల రాక పెరిగిందని, మహిళా సంఘాల ఉత్పత్తులకు మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ మహిళలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని వివరించారు. పాత్రికేయుల సమావేశంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖటారియా, ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ.ఎన్.వి. నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో శక్తి ఆరాధన

## కాళరాత్రి రూపంలో భ్రమరాంబ

### దుష్టశక్తుల సంహారం.. భక్తులకు అభయప్రదానం



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) ఒకవైపు వేదమంత్రాల ఘోష.. మరోవైపు చండీహోమాల పవిత్ర జ్వాలలు.. ఇంకోవైపు అమ్మవారి నామస్మరణతో పులకించిన భక్తజనం.. సంప్రదాయ కళారూపాల నడుమ గజవాహనంపై విహరించే స్వామి అమ్మవార్లు.. ఇలా శ్రీశైల క్షేత్రం ఆధ్యాత్మిక వైభవంతో విరాజిల్లింది. దసరా మహోత్సవాల్లో ఏడో రోజైన శనివారం శ్రీ భ్రమరాంబికాదేవి కాళరాత్రి స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవదుర్గలలో ఏడో రూపమైన కాళరాత్రి ఆరాధనతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. రాత్రి స్వామి అమ్మవార్లకు గజవాహనసేవ నిర్వహించగా, దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదికపై సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

**రౌద్రరూపంలోనూ శుభప్రదాయిని..**

నవరాత్రి ఉత్సవాల్లో ఏడో రోజు పూజలందుకునే కాళరాత్రిదేవి రూపం అత్యంత విశిష్టమైనది. దుష్టశక్తులను సంహరించి భక్తులకు నిర్భయత్వాన్ని ప్రసాదించే శక్తిస్వరూపిణిగా అమ్మవారిని ఆరాధిస్తారు. రూపం రౌద్రంగా కనిపించినా భక్తులకు శుభాలను ప్రసాదించే తల్లిగా కొలుస్తారు. అందుకే కాళరాత్రిదేవిని 'శుభంకరి' అని కూడా పిలుస్తారు.నల్లని దేహఛాయ, విరబోసుకున్న కేశాలు, చతుర్భుజాలతో దర్శనమిచ్చే ఈ దేవి కుడి చేతులతో అభయముద్ర, వరదముద్రలను ప్రదర్శిస్తూ.. ఎడమ చేతుల్లో ఖడ్గం, లోహకంటకాన్ని ధరించినట్లు పురాణ సంప్రదాయం వివరిస్తుంది. అధర్మంపై ధర్మం సాధించే విజయానికి, భయంపై ధైర్యం సాధించే ఆధిక్యానికి ఈ రూపం ప్రతీకగా నిలుస్తుంది.కాళరాత్రి అమ్మవారిని స్మరించడం వల్ల భయాలు తొలగి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని భక్తుల విశ్వాసం. చెడుపై మంచికి విజయాన్ని చాటే దసరా పర్వదినాల్లో ఈ రూపాన్ని ఆరాధించడం విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యం సంతరించుకుంది.

# నవరాత్రుల ఎనిమిదో రోజు..

# మహాగౌరి అమ్మవారి అవతారం విశిష్టత

### తెల్లని దివ్యకాంతులతో దర్శనమిచ్చే జగన్మాత.. పవిత్రత, శాంతి, సౌభాగ్యాలకు ప్రతీకగా ఆదిశక్తి

### భక్తుల కష్టాలను తొలగించి శుభాలను ప్రసాదించే మహాగౌరి దేవి

(ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న )

నవరాత్రి ఉత్సవాల్లో ఎనిమిదో రోజుకు ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. నవదుర్గలలో ఎనిమిదో రూపమైన మహాగౌరి అమ్మవారిని ఈ రోజున భక్తులు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. తెల్లని దివ్యకాంతులతో ప్రకాశించే అమ్మవారు పవిత్రత, శాంతి, కరుణ, సౌభాగ్యాలకు ప్రతీకగా నిలుస్తారు. భక్తుల కష్టాలను తొలగించి, జీవితాల్లో సుఖసంతోషాలు నింపే తల్లిగా మహాగౌరి దేవిని కొలుస్తారు.

#### మహాగౌరి అనే పేరు వెనుక అర్థం ఏమిటి?

'మహా' అంటే గొప్పది, 'గౌరి' అంటే తెల్లని కాంతితో ప్రకాశించేది లేదా స్వచ్ఛతకు ప్రతీకగా నిలిచేది. ఈ రెండు పదాల కలయికతో మహాగౌరి అనే పేరు ఏర్పడింది. అమ్మవారి రూపం పవిత్రతకు, నిర్మలమైన మనసుకు, ప్రశాంతతకు ప్రతీకగా భావిస్తారు. పురాణ సంప్రదాయాల ప్రకారం, పార్వతీదేవి శివుడిని భర్తగా పొందేందుకు దీర్ఘకాలం కఠోర తపస్సు ఆచరించారు. ఆ తపస్సు కారణంగా ఆమె శరీరఛాయ నల్లగా మారిందని, అనంతరం శివుడి అనుగ్రహంతో ఆమె తెల్లని దివ్యకాంతితో ప్రకాశించారని కథనం. ఈ రూపాన్నే మహాగౌరిగా ఆరాధిస్తారు.

#### అమ్మవారి దివ్యరూపం.. విశిష్టత

మహాగౌరి అమ్మవారు తెల్లని వస్త్రాలను ధరించి, తెల్లని వర్ణంతో ప్రకాశిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. సాధారణంగా నాలుగు చేతులతో చిత్రించబడే ఈమె ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో డమరుకం ధరించి, మిగిలిన రెండు చేతులతో అభయముద్ర, వరదముద్రలను ప్రదర్శిస్తారు. వృషభం అంటే తెల్లని ఎద్దు ఆమె వాహనంగా ప్రసిద్ధి చెందింది. అమ్మవారి తెల్లని వర్ణం స్వచ్ఛతకు, శాంతికి ప్రతీక. త్రిశూలం శక్తిని, డమరుకం సృష్టి నాదాన్ని సూచిస్తాయని ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో భావిస్తారు. అభయముద్ర భక్తులకు రక్షణను, వరదముద్ర అనుగ్రహాన్ని తెలియజేస్తాయి.

#### పురాణ గాథలో మహాగౌరి అమ్మవారి ప్రాధాన్యత

పార్వతీదేవి తన తపస్సుతో శివుడిని ప్రసన్నం చేసుకున్న దివ్యరూపంగా మహాగౌరిని పురాణ సంప్రదాయాలు వివరిస్తాయి. ఆమె తపస్సు పట్టుదలకు, ఆత్మనిగ్రహానికి, దృఢ సంకల్పానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ అవతారం ద్వారా మనసులోని మలినాలను తొలగించుకుని, మంచితనంతో జీవించాలని సందేశం లభిస్తుంది. ఎంతటి కష్టాలు ఎదురైనా పట్టుదలతో ప్రయత్నిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చనే స్ఫూర్తిని మహాగౌరి అమ్మవారి కథ అందిస్తుంది.

#### ఎనిమిదో రోజు పూజల విశిష్టత

నవరాత్రుల ఎనిమిదో రోజును దుర్గాష్టమిగా కూడా జరుపుకుంటారు. ఈ రోజున భక్తులు మహాగౌరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుష్పార్చన, దీపారాధన, నైవేద్య సమర్పణతో పాటు అమ్మవారి నామస్మరణ, మంత్రపఠనం చేస్తారు. కొన్ని సంప్రదాయాల్లో కన్యాపూజకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. మహాగౌరి అమ్మవారిని ఆరాధించడం వల్ల మనశ్శాంతి, శుభం, సౌభాగ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. కుటుంబంలో సుఖసంతోషాలు నెలకొనాలని, కష్టాలు తొలగిపోవాలని, జీవితంలో మంచి మార్పులు రావాలని భక్తులు ప్రార్థిస్తారు. పూజా విధానాలు ప్రాంతీయ సంప్రదాయాలను బట్టి మారవచ్చు.

#### నేటి సమాజానికి అమ్మవారి సందేశం

మహాగౌరి అమ్మవారి అవతారం నేటి సమాజానికి విలువైన సందేశాన్ని అందిస్తుంది. మనిషి బాహ్య సౌందర్యం కంటే అంతరంగంలోని మంచితనం, నిజాయితీ, కరుణ, సహనం ఎంతో ముఖ్యమైనవి. ఇతరులను గౌరవించడం, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం, కుటుంబంలో ప్రేమాభిమానాలను పెంపొందించడం ద్వారా జీవితాన్ని మరింత అందంగా మార్చుకోవచ్చు. అలాగే, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు నిరాశ చెందకుండా పట్టుదలతో ముందుకు సాగాలి. మనసును ప్రశాంతంగా ఉంచుకుని, ఆలోచనల్లో స్వచ్ఛతను



పాటిస్తూ, మంచి పనులు చేయడానికి ప్రయత్నించాలి. ఇదే మహాగౌరి అమ్మవారి అవతారం అందించే అంతరార్థం.

#### పవిత్రత, శాంతి, సౌభాగ్యాలకు ప్రతీక

నవరాత్రుల ఎనిమిదో రోజు మహాగౌరి అమ్మవారిని ఆరాధించడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తుంది. ఆమె దివ్యరూపం మనసులోని అశాంతిని తొలగించి, మంచితనం వైపు నడవాలని గుర్తుచేస్తుంది. భక్తి, పట్టుదల, కరుణ, పవిత్రతతో కూడిన జీవనమే నిజమైన శ్రేయస్సుకు మార్గమని ఈ అవతారం చాటిచెబుతుంది.

# వైసీపీకి దౌర్జన్య రాజకీయాలే అజెండానా

### స్థానిక ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తోంది,

### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దు

### కర్ణాటక నుంచి వాహనాలా.. బలప్రదర్శన కోసమేనా.?

### జనాన్ని భయపెట్టడం సరికాదు: ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్




నగరి(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అధికార కూటమి, వైసీపీ మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. వైసీపీ హింసాత్మక చర్యలతో ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని ప్రయత్నిస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆరోపించారు. పుంగనూరు, రాయచోటిలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ప్రస్తావిస్తూ.. దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడం సరికాదని విమర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందని స్పష్టం చేశారు.

#### గతంలో ఏకగ్రీవాలు ఎలా జరిగాయి.?

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నామినేషన్ పత్రాలను తీసుకోవడం, అభ్యర్థులను అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను తొలగించడం వంటి ఘటనలు జరిగాయని భాను ప్రకాష్ ఆరోపించారు. తిరుపతిలో గతంలో జరిగిన ఏకగ్రీవాలపైనా ప్రశ్నలు సంధించారు. ఇంత పెద్ద సంఖ్యలో ఏకగ్రీవాలు ఎలా సాధ్యమయ్యాయని నిలదీశారు. నామినేషన్ వేయడానికి వెళ్లే అభ్యర్థులు యుద్ధానికి వెళ్తున్నట్లుగా భయపడే పరిస్థితులు ప్రజాస్వామ్యానికి మంచివి కావని వ్యాఖ్యానించారు.ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై పోరాడాల్సింది పోయి, ఇతరులపై ఆరోపణలు చేయడమే వైసీపీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. తప్పులు చేస్తూ ఎదుటివారిపై నిందలు వేయడం, అబద్ధాలను పదేపదే ప్రచారం చేయడం వల్ల నిజాలు మారిపోవని అన్నారు. అయితే, గత ఎన్నికలకు సంబంధించిన ఆరోపణలు, ఏకగ్రీవాలపై విమర్శలు రాజకీయ నేతల వ్యాఖ్యలేనని, వాటిపై సంబంధిత ఆధారాల పరిశీలన అవసరమనే అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.

#### కర్ణాటక నుంచి వాహనాలెందుకు.?

ఎన్నికల సమయంలో పదుల సంఖ్యలో కార్లతో వచ్చి బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏమిటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలను తీసుకొచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జనసమూహాల మధ్య వేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని, ఇలాంటి వ్యవహారాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రాజకీయ బలప్రదర్శనల కంటే ప్రజల భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఎన్నికల బరిలో ఎవరు నిలబడాలన్నది, ఎవరికి ఓటు వేయాలన్నది ప్రజల నిర్ణయమని, వారిని భయపెట్టి రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూడటం సరికాదని వ్యాఖ్యానించారు.

#### 164 సీట్ల తీర్పును మరిచారా.?

గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి 164 స్థానాలు, వైసీపీకి 11 స్థానాలు రావడాన్ని ప్రస్తావిస్తూ ప్రజలు తమ తీర్పును స్పష్టంగా వెల్లడించారని భాను ప్రకాష్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా విషయంలోనూ ప్రజల మద్దతుతో పాటు చట్టపరమైన నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించలేని పరిస్థితులు ఉన్నాయని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. మూడు రాజధానుల అంశం నుంచి ప్రస్తుత రాజకీయ పరిణామాల వరకు వైసీపీ అభివృద్ధి అంశాలపై దృష్టి పెట్టకుండా వెటకారపు వ్యాఖ్యలకే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.

#### కూటమి ఐక్యతే లక్ష్యం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యత కొనసాగుతుందని భాను ప్రకాష్ తెలిపారు. కూటమి ధర్మాన్ని కాపాడుతూ స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేస్తామని చెప్పారు. వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని హితవు పలికారు.ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థుల పనితీరు, ప్రజా సమస్యలపై వారి నిబద్ధతను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని, అభివృద్ధిని కాపాడాలంటే ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగాలని, ప్రజల తీర్పును అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాలని పేర్కొన్నారు.

# పండుగకు పిలిచి.. ప్రాణం తీశారు

### భర్త హత్య కేసులో భార్య సహా 10 మందికి జీవిత ఖైదు

### సీసీటీవీ ఫుటేజీ కీలక సాక్ష్యం.. రెండేళ్ల విచారణ తర్వాత వరంగల్ కోర్టు తీర్పు

వరంగల్ (ప్రశ్న న్యూస్) వైవాహిక వివాదం హత్యకు దారితీసింది. సమస్యలను పరిష్కరించుకుందామని పండుగ పేరుతో పిలిచిన భర్తను హత్య చేసిన కేసులో భార్య సహా 10 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ వరంగల్ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. రంగంపేటకు చెందిన దత్తు శ్రీనివాస్ హత్య కేసులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ ఈ తీర్పు ఇచ్చినట్లు అందిన సమాచారం పేర్కొంది. సీసీటీవీ దృశ్యాలు ఈ కేసులో కీలక సాక్ష్యాలుగా నిలిచినట్లు సమాచారం.

#### ఏడాదిలోపే విభేదాలు..

రంగంపేటకు చెందిన దత్తు శ్రీనివాస్‌కు, వరంగల్ నగరంలోని రంగశాయిపేటకు చెందిన బజ్జూరి రమ్యశ్రీతో 2015లో పెద్దల సమక్షంలో వివాహమైంది. అయితే పెళ్లయిన ఏడాదిలోపే ఇద్దరి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. దీంతో రమ్యశ్రీ పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం భర్త, ఆయన కుటుంబ సభ్యులపై పలు కేసులు నమోదు చేసింది. ఈ పరిణామాలతో ఇరు కుటుంబాల మధ్య వివాదాలు కొనసాగినట్లు సమాచారం.

#### పండుగ పేరుతో పిలిచి..

వివాదాలు కొనసాగుతున్న సమయంలో 2024 ఫిబ్రవరి 13న బొడ్రాయి పండుగ ఉందని, కలిసి వేడుక జరుపుకొంటూ సమస్యలకు ముగింపు పలుకుదామని శ్రీనివాస్‌ను అత్తింటివారు ఆహ్వానించినట్లు సమాచారం. భార్యతో తిరిగి కాపురం ప్రారంభించవచ్చనే ఆశతో ఆయన అత్తగారింటికి వెళ్లారు. అయితే అక్కడ జరిగిన ఘర్షణలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు కేసు వివరాలు పేర్కొంటున్నాయి.

#### సీసీటీవీ దృశ్యాలే కీలకం..

ఈ హత్యకు సంబంధించిన ఘటనలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డైనట్లు సమాచారం. పోలీసులు వాటితోపాటు ఇతర ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ సందర్భంగా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నేరం



రుజువైనట్లు నిర్ధారించి శిక్ష విధించినట్లు అందిన సమాచారం వెల్లడిస్తోంది.

#### పదిమందికి జీవిత ఖైదు

ఈ కేసులో భార్య రమ్యశ్రీతోపాటు ఆమె తల్లిదండ్రులు, సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు, స్నేహితురాలు అలేఖ్య సహా మొత్తం 10 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు సమాచారం. తీర్పుతో ఈ కేసు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



# వెంటనే డిలీట్ చేయండి..

## లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవు: నటి నేహా శర్మ

- ఏఐ మార్ఫింగ్ ఫొటోలపై నేహా శర్మ సీరియస్
- ఇది తన ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్య అని ఆవేదన
- అనధికార వీడియోలు, ఇమేజ్‌లను వెంటనే తొలగించాలని డిమాండ్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన ఫొటోలు, వీడియోలను అనధికారికంగా వాడుతున్న వారిపై బాలీవుడ్ హీరోయిన్ నేహా శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా సృష్టించిన ఏఐ కంటెంట్ తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని, ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఒక ప్రకటన విడుదల చేశారు.

"నా ఫొటో లేదా పోలికలతో ఏఐ వీడియోలు, ఇమేజ్‌లు సృష్టిస్తున్న వారు వెంటనే ఆపాలి. ఇప్పటికే పోస్ట్ చేసిన కంటెంట్‌ను తక్షణమే తొలగించండి. నా గుర్తింపును ఉపయోగించి కొత్తగా ఎలాంటి ఏఐ కంటెంట్‌ను తయారుచేయవద్దు, ఎడిట్ చేయవద్దు, సర్క్యులేట్ చేయవద్దు" అని ఆమె స్పష్టం చేశారు.

"ఈ విధంగా నా ముఖాన్ని ఉపయోగించి నన్ను తప్పుగా చిత్రీకరించడం లేదా నా ప్రతిష్ఠ దెబ్బతీయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. నా ముఖాన్ని లేదా పోలికలను అనధికారికంగా ఉపయోగించడానికి నేను అంగీకరించను. ఈ పోస్ట్‌ను అధికారిక హెచ్చరికగా పరిగణించండి. ఇలాంటి కంటెంట్‌ను సృష్టించిన, పోస్ట్ చేసిన, సర్క్యులేట్ చేసిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. ఫేక్ అకౌంట్లు లేదా ఏఐ టెక్నాలజీ వెనుక దాక్కుంటే శిక్ష నుంచి తప్పించుకోలేరు" అని నేహా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్, మార్ఫింగ్ కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో నేహా శర్మ హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఈ నెలలోనే ముహూర్తం?



'రంగస్థలం' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన రామ్‌చరణ్–సుకుమార్ ద్వయం కలయికలో మరో భారీ చిత్రం రాబోతున్న విషయం తెలిసిందే. 'ఆర్‌సీ17'వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా తెరకెక్కించబోతున్నాయి. ఇటీవలే ఈ సినిమా తాలూకు ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ నెలలోనే సినిమాను లాంఛనంగా ప్రారంభించబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం చిత్రబృందం సాంకేతిక నిపుణుల ఎంపికపై కసరత్తులు చేస్తున్నదని తెలిసింది. సంగీత దర్శకులుగా దేవిశ్రీప్రసాద్, అనిరుధ్ రవిచందర్, 'ధురంధర్' ఫేమ్ శశ్వత్ సచ్‌దేవ్ పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఇక కథానాయికగా సారా అర్జున్ పేరు వినిపిస్తున్నది. సినిమా లాంచింగ్ రోజే ప్రధాన నటీనటులు, సాంకేతిక బృందం వివరాల్ని వెల్లడించే అవకాశాలున్నాయి. 'పుష్ప' ఫ్రాంఛైజీ తర్వాత సుకుమార్ తెరకెక్కించబోతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా సినీ ప్రియుల్లో ఆసక్తినెలకొంది. ఈ సినిమా కోసం సుకుమార్ ఎలాంటి కథను ఎంచుకున్నారు? కథా నేపథ్యం ఏమిటనే విషయాలపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో ఈ సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్ వెలువడే అవకాశముంది.

# నా కెరీర్‌లో గర్వపడే సినిమా 'రణబాలి'



'ఇది నా 14వ సినిమా. ముప్పై సినిమాలు చేసిన తర్వాత కూడా ఒక సినిమా గురించి, అందులోని పర్‌ఫార్మెన్స్ గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటారు. అలాంటి చిత్రమే 'రణబాలి'. ఈ సినిమా చేస్తున్నప్పుడు పెద్ద హిట్ కొట్టాలి.. బాక్సాఫీస్ వద్ద పెద్ద నెంబర్స్ క్రియేట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోలేదు. అందరికి చెప్పాల్సిన కథ అనిపించింది. నా కెరీర్‌లో గర్వపడే సినిమా అవుతుంది' అన్నారు అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ.ఆయన తాజా చిత్రం 'రణబాలి' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీమూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'ఈ ఏడాది తెలుగు సినిమా నుంచి వచ్చిన బెస్ట్‌ఫిల్మ్ ఇదని చెప్పగలను.సినిమాలోని కొన్ని ఎపిసోడ్స్ గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నారు. డైరెక్టర్ విక్రమ్ కుమార్‌తో ఓ రొమాంటిక్ సినిమా చేయబోతున్నా. మంచి స్క్రిప్ట్ కుదిరింది. ఇప్పుడు నేను చేస్తున్న ప్రతీ సినిమా ఇష్టపడే చేస్తున్నా' అన్నారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే పోరాడాలనే స్ఫూర్తిని అందించే చిత్రమిదని..ఇందులో రణబాలి, జయమ్మ పాత్రలను తీర్చిదిద్దిన విధానం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నదని కథానాయిక రష్మిక మందన్న పేర్కొన్నది.బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా భారీ వసూళ్లు సాధిస్తుందనే నమ్మకం ఉందని, ఫ్యామిలీ ఆడియెన్స్ మంచి ఆదరణ కనబరుస్తున్నారని నిర్మాత రవిశంకర్ అన్నారు. ఏపీ, తెలంగాణలోని అన్ని ఏరియాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, విజయ్ దేవరకొండ కెరీర్‌లో భారీ హిట్‌గా నిలుస్తుందని నిర్మాత నవీన్ యెర్నేని చెప్పారు. సినిమా తీసిన మంచి ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొని ఆదరిస్తున్న ప్రేక్షకులకు దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కృతజ్ఞతలు తెలిపారు.

# బాలీవుడ్‌లో మరో బంపరాఫర్



దక్షిణాది యువతరంలో మంచి క్రేజ్ సంపాదించుకున్న అచ్చ తెలుగందం శ్రీలీల ఇప్పుడు హిందీలో కూడా వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్‌బసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ మ్యూజికల్ డ్రామాలో శ్రీలీల నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ భామ హిందీలో మరో బంపరాఫర్‌ను దక్కించుకుంది. సిద్ధార్థ్ గుప్తా ప్రధాన పాత్రలో రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రం తెరకెక్కుతున్నది. దీనికి ఉమేశ్ బిష్ట్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీకపూర్, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లో ప్రారంభమైంది. ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని సమాచారం. బాలాజీ మోషన్ పిక్చర్స్ పతాకంపై ఏక్తా కపూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలీవుడ్‌లో తొలి చిత్రం రిలీజ్ కాకముందే మరో భారీ ఆఫర్‌తో శ్రీలీల అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది.

# కత్తి పట్టిన సీతగా సాయి పల్లవి..

## – అదరగొడుతున్న 'రామాయణం' కొత్త ప్రోమో!



నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్–ఇండియా చిత్రం 'రామాయణం' తాలూకు కొత్త ప్రోమో ప్రస్తుతం సినిమా వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో సీతాదేవిగా నటిస్తున్న సాయి పల్లవి చేతిలో కత్తితో యోధురాలి రూపంలో కనిపించిన విజువల్స్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా సినిమాలలో సీతాదేవి పాత్రను కేవలం బాధ్యతాయుతమైన భార్యగా మాత్రమే చూపించడం ఆనవాయితీగా వస్తుండగా, ఈ చిత్రంలో ఆమెలోని ధైర్యసాహసాలు, యోధురాలి కోణాన్ని ఆవిష్కరించేలా మేకర్స్ ఈ ప్రోమోను రూపొందించారు. ఈ విజువల్ వండర్ సినిమాకు సంబంధించిన ఈ కొత్త ప్రోమో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. రణబీర్ కపూర్ రాముడిగా, యష్ రావణాసురుడిగా, సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. నవంబర్ 5న దీపావళి కానుకగా ఈ చిత్ర మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# నా కల చెదిరిపోయింది!



కర్ణాటక సంగీత విద్వాంసురాలు, దిగ్గజ గాయని ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవితకథతో రూపొందిస్తున్న 'భారతరత్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి' చిత్రం ఇటీవలే ప్రారంభమైన విషయం తెలిసిందే. రష్మిక మందన్న టైటిల్ రోల్‌ని పోషిస్తున్న ఈ చిత్రానికి 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. అయితే పదేళ్ల క్రితమే ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా ఓ చిత్రం తెరకెక్కాల్సి ఉంది. విద్యాబాలన్ ప్రధాన పాత్రలో రాజీవ్ మీనన్ దర్శకత్వంలో ఈ బయోపిక్ కోసం ప్రయత్నాలు జరిగాయి. కానీ న్యాయపరమైన వివాదాల కారణంగా ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఈ విషయం గురించి విద్యాబాలన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటించాలనే తన కల నెరవేరకపోవడం బాధగా ఉందని ఆమె పేర్కొన్నది.'చిన్నతనంలో ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పాడిన సుప్రభాతంతోనే ఇంట్లో రోజు మొదలయ్యేది. ఆమె జీవితం గురించి నాకు చాలా విషయాలు తెలుసు. రాజీవ్ మీనన్ అద్భుతమైన స్క్రిప్ట్ సిద్ధం చేశాడు. కానీ అనుకోకుండా సినిమా ఆగిపోయింది' అని విద్యాబాలన్ చెప్పింది. అయితే రెండేళ్ల క్రితం ఎం.ఎస్.సుబ్బులక్ష్మికి నివాళిగా ఆమె జయంతి రోజున ప్రత్యేకమైన ఫొటోషూట్‌తో ముందుకొచ్చింది విద్యాబాలన్. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పాత్రకు పర్‌ఫెక్ట్ ఛాయిస్ అంటూ ఆమె ఫొటోషూట్‌పై ప్రశంసలు లభించాయి.

# 'జైలర్ 2' బాక్సాఫీస్ సునామీ.. రెండు రోజుల్లోనే రూ.209 కోట్ల వసూళ్లు!



సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ నిర్మించిన భారీ యాక్షన్ చిత్రం 'జైలర్ 2' విడుదలైన రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల వసూళ్ల మైలురాయిని దాటినట్లు ట్రేడ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మోహన్‌లాల్, విద్యాబాలన్, హృతిక్ రోషన్ వంటి ప్రముఖ తారల ప్రత్యేక పాత్రలు కూడా సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. తొలి రోజు భారీ వసూళ్లు సాధించిన ఈ చిత్రం, రెండో రోజు కూడా నిలకడైన వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తున్నట్లు సమాచారం. సాక్నిల్క్ గణాంకాల ప్రకారం.. 'జైలర్ 2' తొలి రోజు భారతదేశంలో రూ.59.70 కోట్ల నికర వసూళ్లు సాధించినట్లు అంచనా. రెండో రోజు శుక్రవారం పని దినం కావడంతో వసూళ్లు కొంత తగ్గినప్పటికీ, దేశీయంగా రూ.35.60 కోట్ల నికర వసూళ్లు వచ్చినట్లు సమాచారం. దీంతో రెండు రోజుల్లో భారతదేశంలో మొత్తం నికర వసూళ్లు రూ.95.30 కోట్లకు చేరుకున్నాయి. దేశీయ గ్రాస్ వసూళ్లు సుమారు రూ.112.10 కోట్లుగా నమోదైనట్లు అంచనాలు చెబుతున్నాయి. విదేశీ మార్కెట్ల వసూళ్లను కలుపుకుంటే ప్రపంచవ్యాప్తంగా మొత్తం గ్రాస్ వసూళ్లు రూ.209.10 కోట్లకు చేరినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. భారతీయ మార్కెట్‌తో పాటు విదేశాల్లోనూ 'జైలర్ 2'కు మంచి స్పందన లభిస్తున్నట్లు ట్రేడ్ వర్గాల గణాంకాలు సూచిస్తున్నాయి. రెండో రోజు విదేశీ మార్కెట్ల నుంచి సుమారు రూ.40 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు సమాచారం. దీంతో రెండు రోజులకు కలిపి ఓవర్సీస్ వసూళ్లు సుమారు రూ.97 కోట్లకు చేరినట్లు అంచనా. ఇదే జోరు కొనసాగితే విదేశీ మార్కెట్లో రూ.100 కోట్ల గ్రాస్ మైలురాయిని ఈ చిత్రం త్వరలోనే అధిగమించే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా రెండు రోజుల్లోనే రూ.200 కోట్ల మార్కును దాటడం రజనీకాంత్ సినిమాకు లభిస్తున్న ఆదరణను తెలియజేస్తోంది. తమిళ వెర్షన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తోంది. శుక్రవారం తమిళనాడులో 7,243 ప్రదర్శనల ద్వారా సుమారు రూ.25.25 కోట్ల వసూళ్లు సాధించినట్లు నివేదికలు చెబుతున్నాయి. రాత్రి ప్రదర్శనలకు అక్కడ ఆక్యుపెన్సీ 85.92 శాతానికి చేరినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల్లోనూ సినిమా మంచి వసూళ్లు సాధించినట్లు అంచనాలు వెల్లడిస్తున్నాయి. తెలుగు వెర్షన్ 1,940 ప్రదర్శనల ద్వారా రెండో రోజు సుమారు రూ.7.25 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. రాత్రి ప్రదర్శనల సమయానికి ఆక్యుపెన్సీ 73.64 శాతంగా నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. హిందీ వెర్షన్ నుంచి రూ.2.75 కోట్లు, కన్నడ వెర్షన్ నుంచి సుమారు రూ.35 లక్షల వసూళ్లు వచ్చినట్లు అంచనా. అయితే రూ.500 కోట్ల మార్కును చేరుతుందా లేదా అన్నది రానున్న రోజుల్లో వసూళ్లను బట్టి స్పష్టమవుతుంది.

## సోనియా గాంధీ నగర్ కాలనీలో శ్రీ దుర్గా మాత ఆలయంలో అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజలు

**- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజా గాయకులు. రచయిత దామరపల్లి నర్సింహారెడ్డి**



కాప్రా (ప్రశ్న న్యూస్) కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ డివిజన్, శుక్రవారం రాత్రి సోనియా గాంధీ నగర్ కాలనీ లో కొలువుదీరిన శ్రీ దుర్గా మాత అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ప్రజా గాయకులు తామరపల్లి నర్సింహారెడ్డి. కుటుంబ సభ్యులు. దామరపల్లి లత . దామరపల్లి హర్షవర్ధన్ రెడ్డి. దామరపల్లి హర్షిని రెడ్డి . లు కుటుంబ సమేతంగా. పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దామరపల్లి నర్సింహారెడ్డి అమ్మవారికి పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా దామరపల్లి నర్సింహారెడ్డి మాట్లాడుతూ, శ్రీ దుర్గా మాత అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. దైవభక్తి, ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను అందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. దేవి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అమ్మవారి కృపతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని కోరుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో సోనియా గాంధీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కుందనపల్లి సిద్దు రాములు. మైలారం బాల నరసింహ. జై భవాని మాత భక్తులు. జై దుర్గ మాత. జై జై దుర్గ మాత.. ముగ్గురు అమ్మలగన్న మూలదేవత కనకదుర్గమ్మ. అంటూ భక్తులు ఆలపించిన ఆధ్యాత్మికత చింతనలో అమ్మవారి దేవాలయం మునిగిపోయింది. భక్తుల నినాదాలు ఒరెత్తాయి. అమ్మవారి భక్తులు. మహిళా భక్తులు. చిన్నారులు. పాల్గొని అమ్మవారికి పూజలు ఘనంగా నిర్వహించారు.

## క్రాంతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవంగా నవరాత్రి వేడుకలు

**11వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం, జాగరణ కార్యక్రమాలు**



కీసర ( ప్రశ్న న్యూస్) దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడలోని ఠాకూర్ కాలనీలో క్రాంతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ, జాగరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా విగ్రహ దాతలు ఓం ప్రకాష్, పసుపునూరి రవీందర్ ఆధ్వర్యంలో ఆరో రోజు అన్నదానం నిర్వహించగా, నమన్ ఉడిపి హోటల్ యజమాని రాజు ఆధ్వర్యంలో జాగరణ కార్యక్రమం చేపట్టారు. ఏడో రోజు అన్నసంతర్పణకు నరేందర్ సింగ్, శివపాల్ సింగ్, శంకర్ ప్రసాద్, ధర్మేందర్ సింగ్, రామ్ రెడ్డి, ప్రతాప్ సహకారం అందించారు. భక్తి, సేవాభావంతో ఉత్సవాలు కొనసాగుతుండటంతో కాలనీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## నకిలీ భూ పత్రాలతో ప్లాట్ విక్రయానికి యత్నం.. ఇద్దరి అరెస్ట్

**రాంపల్లి సర్వే నంబర్ 402లోని ప్లాట్‌పై మోసపూరిత పత్రాల సృష్టి**





కీసర( ప్రశ్న న్యూస్ ) నకిలీ భూ పత్రాలు సృష్టించి, వాటి ఆధారంగా ప్లాట్‌ను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన కేసులో ఇద్దరిని కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. రాంపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 402లో ఉన్న ప్లాట్ నంబర్ 34కు సంబంధించి ఈ మోసం జరిగినట్లు పోలీసులు తెలిపారు.కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించిన డాక్యుమెంట్ నంబర్ 720/1982 పత్రాలను పరిశీలించిన ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ డి. సోనీ, అసలు రిజిస్ట్రేషన్ రికార్డులకు సమర్పించిన పత్రాలకు పొంతన లేదని గుర్తించారు. అసలు పత్రాలు నాగారం గ్రామంలోని మరో ఆస్తికి సంబంధించినవిగా ఉండగా, వాటి వివరాలను ఉపయోగించి రాంపల్లిలోని ప్లాట్‌కు నకిలీ పత్రాలు సృష్టించినట్లు ప్రాథమికంగా గుర్తించారు.ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, అక్టోబర్ 17న మహమ్మద్ ఖదీర్ (ఏ 2), రెగు రాజు (ఏ 4)లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సంబంధిత పత్రాలు, నోటరీ స్టాంప్ పేపర్లు, మొబైల్ ఫోన్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని, ఇతర నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. స్థిరాస్తులు కొనుగోలు చేసే ముందు రిజిస్ట్రేషన్ రికార్డులు, లింక్ డాక్యుమెంట్లు, యాజమాన్య హక్కులను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసులు సూచించారు.

# హైదరాబాద్ -రంగారెడ్డి -మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో డాక్టర్ ఓ. శ్రీనివాస్ రెడ్డి.?

**- పాతికేళ్లుగా కమలం పార్టీకి అంకిత సేవలు.. ఎమ్మెల్సీ టికెట్‌పై ఆశలు**

**- విద్యారంగంలో సుదీర్ఘ అనుభవం.. ఓటరు నమోదులో విస్తృత ప్రచారం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈసారి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తరఫున ఎమ్మెల్సీ బరిలో నిలిచే ఆశావహుల్లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జాగృతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఓ. శ్రీనివాస్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పాతికేళ్లుగా పార్టీ జెండా మోస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న ఆయనకు ఈసారి అవకాశం దక్కుతుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది.

### పాతికేళ్ల అంకితభావం.. పార్టీ విధేయత

రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే నాయకులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. డాక్టర్ ఓ. శ్రీనివాస్ రెడ్డి దాదాపు 25 ఏళ్లుగా బీజేపీలో కొనసాగుతూ వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సంస్థాగత బలోపేతానికి శ్రమించారని ఆయన సన్నిహితులు గుర్తుచేస్తున్నారు. పదవుల కోసం కాకుండా పార్టీ శ్రేయస్సు కోసం పనిచేసిన ఆయనకు ఈసారి పట్టభద్రుల ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని మద్దతుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### విద్యారంగ అనుభవమే ప్రధాన బలం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుల సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వానికే ప్రాధాన్యం ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. జాగృతి విద్యాసంస్థల చైర్మన్‌గా కొనసాగుతున్న డాక్టర్ శ్రీనివాస్ రెడ్డికి విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లపై స్పష్టమైన అవగాహన ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నత చదువులు పూర్తిచేసినా ఉద్యోగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్న యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు, ప్రైవేటు రంగా ఉద్యోగుల సమస్యలను శాసనమండలి వేదికగా గొంతుకై వినిపించగల నాయకత్వం అవసరమని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనకున్న విద్యారంగ అనుబంధం అభ్యర్థిత్వానికి కలిసొచ్చే అంశంగా మారనుంది.

### ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు అత్యంత కీలకమైన ప్రక్రియ. అర్హులైన పట్టభద్రులు ప్రతీ ఒక్కరూ ఓటర్లుగా నమోదయ్యేలా అవగాహన కల్పించే కార్యక్రమాల్లో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి విస్తృతంగా పాల్గొన్నారు. విద్యావంతులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను శాసనసభల్లో వినిపించే సరైన ప్రతినిధిని ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

### అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ

పార్టీకి పాతికేళ్ల సేవలు, రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు, విద్యారంగంతో సుదీర్ఘ అనుబంధం వంటి అంశాలు డాక్టర్ ఓ. శ్రీనివాస్ రెడ్డికి అనుకూలించే అవకాశాలు ఉన్నప్పటికీ, బీజేపీ అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుందన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అభ్యర్థి ఎంపికలో పార్టీ విధేయత, ప్రజల్లో గుర్తింపు, పట్టభద్రులతో సంబంధాలు మరియు గెలుపు అవకాశాలు కీలక ప్రమాణాలుగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో పాతికేళ్ల ఆయన రాజకీయ ప్రస్థానం ఎమ్మెల్సీ టికెట్ తెచ్చిపెడుతుందో లేదో వేచి చూడాలి.

## హైదరాబాద్‌లో కిడ్నాప్ ముఠా గుట్టురట్టు

**వ్యాపారిని అపహరించి రూ.1.30 కోట్ల వసూలు.. 10 మంది అరెస్ట్**

**రూ.1.07 కోట్ల నగదు, 118 గ్రాముల బంగారం, ఐదు వాహనాలు స్వాధీనం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో వ్యాపారిని కిడ్నాప్ చేసి భారీ మొత్తంలో పరిహారం వసూలు చేసిన ముఠా గుట్టును చిక్కడ్‌పల్లి పోలీసులు, సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. ఈ కేసులో 10 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1.07 కోట్ల నగదు, 118.26 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు వాహనాలు, తొమ్మిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండటంతో వారి కోసం గాలిస్తున్నారు.పోలీసుల వివరాల ప్రకారం రామంతాపూర్‌లో జ్యువెలరీ వ్యాపారం నిర్వహించే కె. శ్రీనివాసరావు (53) అక్టోబర్ 5న షాపుకు వెళ్తూ అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో చిక్కడ్‌పల్లి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఇది పక్కా ప్రణాళికతో జరిగిన కిడ్నాప్‌గా గుర్తించారు.బొడుప్పల్‌లోని హేమానగర్ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు సంబంధించి బాధితుడు శ్రీనివాసరావు, ప్రధాన నిందితుడు దుమావత్ శ్రీకాంత్ మధ్య పాత వివాదాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ మరో నిందితులతో కలిసి కిడ్నాప్‌కు కుట్ర పన్నినట్లు వెల్లడించారు. గోల్నాక ఫ్లైఓవర్ వద్ద పోలీసులుగా నటించి వ్యాపారిని బలవంతంగా అపహరించి, కళ్లకు గంతలు కట్టి గుర్తుతెలియని ప్రాంతానికి తరలించినట్లు విచారణలో తేలింది.మొదట రూ.15 కోట్లు డిమాండ్ చేసి, చివరకు బాధితుడి కుటుంబ సభ్యుల నుంచి రూ.1.30 కోట్లు వసూలు చేసి విడిచిపెట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల నిఘా నుంచి తప్పించుకునేందుకు నకిలీ నంబర్ ప్లేట్లు, వేర్వేరు వాహనాలను ఉపయోగించినట్లు పేర్కొన్నారు.ప్రధాన నిందితుడు శ్రీకాంత్‌పై గతంలో 16 చీటింగ్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు సురేష్‌పై దొంగతనాలు, దోపిడీలు, కిడ్నాప్ వంటి కేసులు ఉన్నాయని వెల్లడించారు.డీసీపీలు రక్షిత కృష్ణమూర్తి, వైభవ్ గైక్వాడ్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఈ కేసును ఛేదించాయి. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు అధికారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అభినందించి, పురస్కారాలు ప్రకటించారు.

## పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తాం

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సి. వసుంధర**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) జిల్లాలోని గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సి. వసుంధర స్పష్టం చేశారు.జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, సంబంధిత ప్రతిపాదనలను ఆమోదించారు. జిల్లాలో నూతన గ్రంథాలయ భవనాల నిర్మాణం చేపట్టడం, ప్రస్తుతం ఉన్న గ్రంథాలయ భవనాలను ఆధునీకరించడం, పాఠకులకు అవసరమైన తాగునీరు, ఫర్నిచర్, పుస్తకాల ర్యాకులు తదితర మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వారు తెలిపారు ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత, విద్యార్థులకు గ్రంథాలయాలను మరింత చేరువ చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. గ్రంథాలయాల్లో చదువుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పఠన సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తక పఠన కేంద్రాలుగానే కాకుండా విద్యార్థులు, యువత విజ్ఞానాభివృద్ధికి, పోటీ పరీక్షల్లో విజయ సాధనకు తోడ్పడే విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్, కార్యదర్శి తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

## గుండ్లపోచంపల్లి డివిజన్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ గా కుండ భానుచందర్



మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ ) గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా కుండ భానుచందర్ రెండోసారి ఎన్నికయ్యారు.తనను నమ్మి మరోసారి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కుండా బాలచందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుండ భానుచందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రెండవసారి ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా అవకాశం కల్పించిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ,హరివర్ధన్ రెడ్డి కి , నక్క ప్రభాకర్ గౌడ్ కి, మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చెన్నయ్య, టీపీసీసీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ మురళీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.తనకు ఈ బాధ్యతను అప్పగించిన నాయకుల నమ్మకాన్ని తప్పకుండ నిలబెట్టుకుంటూ, గుండ్లపోచంపల్లి 299 డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కృషి చేస్తానని కుండా భానుచందర్ తెలిపారు

## ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్)ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.సమన్వయంతో కూడిన చర్యలునిరంతర పర్యవేక్షణ ద్వారా రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ప్రమాదాలను తగ్గించడం పట్ల జిల్లా పరిపాలన తన కట్టుబాటును పునరుద్ఘాటించిందని పేర్కొన్నారు.శనివారం మేడ్చల్లోని ఇంటిగ్రేటెడ్ జిల్లా కార్యాలయాల సముదాయం లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధ్యక్షతన నిర్వహించారు.జిల్లాలో రోడ్డు భద్రతా చర్యల అమలును సమీక్షించడానికి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించడానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సభ్య కార్యదర్శి అయిన మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా రోడ్లు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీరు పి. జలందర్ సమావేశ కార్యసూచిని ప్రవేశపెట్టి, గత సమావేశ నిర్ణయాలపై తీసుకున్న చర్యలను సమీక్షించారు. ప్రమాద ప్రబల ప్రాంతాలు, రోడ్డు సూచికల ఏర్పాటు, వేగ నియంత్రణ చర్యలు, పాదచారుల భద్రత, రోడ్డు మార్కింగ్లు, వీధి దీపాలు వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.అధ్యక్షులు గుర్తించిన రోడ్డు భద్రతా సమస్యలపై సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని, భద్రతా చర్యల సమర్థవంతమైన అమలుకు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం మరియు ప్రమాదానికి గురయ్యే ప్రాంతాలలో కఠిన అమలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సమావేశానికి పోలీసు శాఖ, రవాణా శాఖ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ పరిపాలన, జాతీయ రహదారుల అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు హాజరై చర్చల్లో పాల్గొన్నారు.జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు జైపాల్ రెడ్డి ఇతర కమిటీ సభ్యులు హాజరయ్యారు.

# నేటి నిర్లక్ష్యం.. రేపటి సంక్షోభం

## - నీరు కాపాడాలి..
## - విద్యుత్తు ఆదా చేయాలి!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** విద్యుత్తు, నీరు ఆదా చేయకుంటే భవిష్యత్ అంధకారమే అనేది అక్షరాలా నిజం. ఎల్ నినో ప్రభావంతో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. అలాగే తాగు నీటికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితులు తెలంగాణలో ఏర్పడ్డాయి. అయితే ఉక్కపోత, ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతుండటంతో ఇటు విద్యుత్తు వినియోగంతో పాటు తాగు నీటి అవసరం కూడా పెరుగుతోంది. విద్యుత్తు వాడకం, తాగునీటి వాడకాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే రానున్న కాలంలో హైదరాబాద్ చీకటి మయం అవుతుంది. అదే సమయంలో గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు కూడా దొరకదు. తెలంగాణలో రోజురోజుకూ విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కరెంట్ బిల్లులను తగ్గించుకోవడానికి, విద్యుత్‌ను ఆదా చేయడానికి ఇంటి వద్ద పాటించాల్సిన ముఖ్యమైన చిట్కాలు అవసరం.

### తక్కువ విద్యుత్తును వాడితే

తక్కువ విద్యుత్తును వాడితే ప్రభుత్వం నుంచి రాయితీలు కూడా లభిస్తాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకం ద్వారా అర్హులైన వినియోగదారులకు ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభిస్తుంది.నెలవారీ విద్యుత్ వినియోగం 200 యూనిట్ల లోపు ఉంటేనే ఈ పథకం వర్తిస్తుంది. అందువల్ల ఇంట్లో కరెంట్‌ను పొదుపుగా వాడుకోవడం ద్వారా జీరో బిల్లు పొందవచ్చు. ఎయిర్ కండిషనర్‌ను ఎల్లప్పుడూ 24 డిగ్రీల వద్ద నిర్వహించడం వల్ల గది చల్లగా ఉండటంతో పాటు కరెంట్ బిల్లు భారీగా తగ్గుతుంది. పాత ఏసీల స్థానంలో 5-స్టార్ బీఈఈ రేటింగ్ ఉన్నవాటిని వాడటం మంచిది.అలాగే సాధారణ బల్బుల స్థానంలో తక్కువ విద్యుత్ వినియోగించే ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లను ఉపయోగించాలి.గదిలో ఎవరూ లేనప్పుడు ఫ్యాన్లు, లైట్లు, టీవీలను పూర్తిగా ఆఫ్ చేయాలి. రిమోట్‌తో కాకుండా మెయిన్ స్విచ్ బోర్డు వద్ద ఆఫ్ చేయడం ద్వారా పవర్ వేస్టేజ్ తగ్గుతుంది. ఫ్రిజ్, వాషింగ్ మెషిన్, గీజర్ వంటి గృహోపకరణాలను కొనుగోలు చేసేటప్పుడు ఎక్కువ స్టార్ రేటింగ్ ఉన్నవాటినే ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### సోలార్ విద్యుత్ విధానంతో

ఇంటిపై కప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా మీ కరెంట్ బిల్లును దాదాపు 50శాతానికి పైగా తగ్గించుకోవచ్చు. తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ కూడా ఇందుకు సంబంధించిన ప్రోత్సాహకాలను అందిస్తోంది. విద్యుత్‌ను పొదుపు చేయడం అంటే విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో సమానం. కాబట్టి బాధ్యతగా కరెంట్‌ను వాడుదాం, రాష్ట్రాన్ని రక్షించుకుందాం. ప్రభుత్వానికి సహకరిద్దాం అన్న నినాదాన్ని మర్చిపోకూడదు. విద్యుత్, నీటిని ఆదా చేయకపోతే భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చెప్పడం కూడా కష్టమే.

### విద్యుత్తు ను ఆదా చేయకుంటే

విద్యుత్ కొరత ఏర్పడితే పరిశ్రమలు, ఐటీ రంగాలు, వ్యాపారాలు స్తంభించిపోతాయి. నిరంతర విద్యుత్ కోతల వల్ల రాత్రులు చీకటిమయంగా మారుతాయి.భూగర్భ జలాలు అడుగంటిపోయి, స్వచ్ఛమైన తాగునీరు దొరకడం గగనమవుతుంది. నీటి కోసం యుద్ధాలు జరిగే పరిస్థితి వస్తుంది.పంటలు పండించాలన్నా, వ్యవసాయ మోటార్లు నడవాలన్నా నీరు, విద్యుత్ రెండూ కావాలి. ఇవి లేకపోతే వ్యవసాయం కుంటుపడి తీవ్ర ఆహార కొరత ఏర్పడుతుంది.

ఆసుపత్రుల్లో లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్, అత్యవసర వైద్య పరికరాలు పనిచేయడానికి నిరంతర విద్యుత్ అవసరం. విద్యుత్ లేకపోతే రోగుల ప్రాణాలకే ముప్పు వస్తుంది. నీటిని ఆదా చేయడానికి లీకేజీలు ఉన్న పైపులను వెంటనే రిపేర్ చేయించుకోవడం, ప్రతి ఇంట్లోనూ వర్షపు నీటి నిల్వ గుంతలను ఏర్పాటు చేసుకోవడం, కూరగాయలు కడిగిన నీటిని మొక్కలకు పోయడం వంటి పునర్వినియోగ పద్ధతులు పాటించడంతో నీటితో పాటు విద్యుత్తును కూడా ఆదా చేసి ప్రభుత్వాన్ని సహకరించాలి. ఇది అందరి బాధ్యత. ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి.

# అప్పు పుట్టడం లేదు..
# ఊరికి ప్రయాణం ఎలా.?

**- పెరిగిన ఖర్చులు, తీరని బాధ్యతలు, సామాన్యుడికి తప్పని ఆర్థిక ఇబ్బందులు**




"పండుగకు ఊరెళ్లాలన్నా.. కుటుంబంతో సొంతూరిలో నాలుగు రోజులు గడపాలన్నా.. సామాన్యుడికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. ఒకప్పుడు పండుగ వచ్చిందంటే చాలు.. కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో కలిసి సొంతూరికి వెళ్లేందుకు ఎంతో ఉత్సాహం చూపేవారు. కానీ నేడు పరిస్థితులు మారిపోయాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, అప్పుల వాయిదాలు వంటి బాధ్యతలతో చేతిలో డబ్బులు నిలవడం లేదు. అత్యవసరంగా ఊరికి వెళ్లాల్సి వచ్చినా ప్రయాణ ఖర్చుల కోసం అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది"



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** నెలంతా కష్టపడి పనిచేసి సంపాదించిన జీతం ఇంటి ఖర్చులకే సరిపోతోంది. జీతం వచ్చిన కొద్ది రోజుల్లోనే అద్దె, కిరాణా, కరెంటు బిల్లులు, పిల్లల స్కూల్ ఫీజులు, ఇతర అవసరాలకు డబ్బులు ఖర్చవుతున్నాయి. అనుకోని ఖర్చు ఎదురైతే ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి. అప్పు అడిగితే గతంలో తీసుకున్న అప్పులు తీర్చాలని చెబుతున్నారు. తెలిసినవారి దగ్గర అడగాలన్నా మొహమాటం.. అడగకపోతే అవసరం తీరని పరిస్థితి. దీంతో సామాన్య కుటుంబాలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

### పండుగ వచ్చినా.. ఊరికి వెళ్లలేని పరిస్థితి..

పట్టణాల్లో ఉపాధి కోసం ఉంటున్న అనేక కుటుంబాలకు పండుగల సమయంలో సొంతూరికి వెళ్లడం ఒక భావోద్వేగంతో కూడిన విషయం. తల్లిదండ్రులను కలవాలని, బంధువులతో సమయం గడపాలని, చిన్ననాటి స్నేహితులను పలకరించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ ప్రయాణ ఖర్చులు, కుటుంబ సభ్యుల రాకపోకల వ్యయాలు భారంగా మారుతున్నాయి. బస్సు ఛార్జీలు, ఇతర ప్రయాణ ఖర్చులతో పాటు ఊరికి వెళ్లిన తర్వాత అయ్యే ఖర్చులను తలచుకొని కొందరు ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటున్నారు. మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు చేసి ప్రయాణం చేస్తున్నారు.

### అప్పు అడిగితే దొరకట్లే.. అడగకపోతే అవసరం తీరట్లే..

గతంలో అవసరమైతే స్నేహితులు, బంధువుల దగ్గర కొంత డబ్బు తీసుకొని పని పూర్తి చేసుకునేవారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ తమ తమ ఖర్చులతో సతమతమవుతుండటంతో అప్పు అడిగినా సాయం అందని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు పెరుగుతున్న ఖర్చులు.. మరోవైపు తగ్గని బాధ్యతలు.. ఇంకోవైపు ఆదాయానికి, ఖర్చులకు మధ్య పెరుగుతున్న అంతరం సామాన్యుడిని ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న అవసరానికి కూడా డబ్బుల కోసం ఇబ్బంది పడాల్సి వస్తుండటంతో కుటుంబాల్లో మానసిక ఒత్తిడి పెరుగుతోంది.

### ఆడంబరాల కంటే అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలి..

ఆర్థిక ఇబ్బందుల సమయంలో కుటుంబ సభ్యులు పరస్పరం సహకరించుకోవడం అవసరం. ప్రయాణానికి ముందుగానే ఖర్చులను అంచనా వేసుకోవాలి. అవసరమైన మేరకే ఖర్చు చేయాలి. సాధ్యమైనంత వరకు చిన్న మొత్తమైనా పొదుపు చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. ప్రయాణం కోసం అధిక వడ్డీకి అప్పులు చేయడం, తిరిగి చెల్లించలేని రుణాలు తీసుకోవడం వంటి వాటికి దూరంగా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో చర్చించి అందుబాటులో ఉన్న మార్గాలను ఎంచుకోవాలి.

### బంధాలు ముఖ్యం.. కానీ అప్పుల భారం కాకూడదు..

సొంతూరికి వెళ్లడం అంటే కేవలం ప్రయాణం మాత్రమే కాదు.. మనవాళ్లను కలవడం, ఆప్యాయతను పంచుకోవడం, కుటుంబ బంధాలను బలపరుచుకోవడం. అయితే ఆ ఆనందం కోసం తిరిగి తీర్చలేని అప్పుల భారాన్ని మోయాల్సిన పరిస్థితి రాకూడదు. పండుగైనా, కుటుంబ అవసరమైనా ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

# ఇంద్రకీలాద్రిపై విజయ్-రష్మిక సందడి

**- కనకదుర్గమ్మను దర్శించుకున్న సినీ తారలు..**
**- అభిమానుల కోలాహలం**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో సినీ సందడి నెలకొంది. ప్రముఖ సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ వారిద్దరూ ఆలయానికి రావడంతో భక్తులు, అభిమానుల్లో ఉత్సాహం కనిపించింది. తమ అభిమాన నటీనటులను చూసేందుకు పలువురు ఆసక్తి చూపించారు.

### ప్రత్యేక పూజలు.. వేద ఆశీర్వచనాలు

ఇంద్రకీలాద్రికి చేరుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఆలయ చైర్మన్, ఈవో, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం ముగిసిన తర్వాత వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

### అభిమానుల సందడి..

సినీ తారలు ఆలయానికి రావడంతో ఇంద్రకీలాద్రి ప్రాంగణంలో సందడి నెలకొంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నను చూసేందుకు భక్తులు, అభిమానులు ఆసక్తి కనబరిచారు. వారు అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగడంతో అక్కడ ఉత్సాహభరిత వాతావరణం కనిపించింది. దసరా ఉత్సవాల సందడికి సినీ ప్రముఖుల రాక మరింత ఆకర్షణగా నిలిచింది.

# తెలంగాణలో భూసమగ్ర సర్వేపై మంత్రి పొంగులేటి సమీక్ష..

**- పలు కీలక ఆదేశాలు జారీ**



**హైదరాబాద్, (ప్రశ్న న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూసర్వేపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు భూ రీసర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు ముందు భూ యజమానులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, గ్రామకంతాల హద్దులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.'రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర సర్వేను చేపట్టింది. మూడు దశల్లో ఈ భూసర్వే కొనసాగుతుంది. వచ్చే నెలాఖరులోగా తొలిదశ సర్వే పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. తొలి దశలో భాగంగా ఇప్పటికే 2,720 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి అయింది. సర్వేలో భాగంగా ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయిస్తున్నాం. అనంతరం ప్రతి సర్వేనెంబర్‌కు ప్రత్యేక భూదార్ ఐడీని కేటాయిస్తున్నాం. ఆధునిక సాంకేతికతతో భూముల కొలతలు తీసుకుని డిజిటల్ రూపంలో వివరాలను భద్రపరుస్తున్నాం. ఈ వివరాలన్నింటినీ భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. ఈ మేరకు భూయజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం. పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేస్తాం. కాగా, నేలకొండపల్లి మండలం కొంగరలో 665 ఎకరాల్లో వందశాతం రీసర్వే పూర్తి అయింది' అని మంత్రి పేర్కొన్నారు.

# బతుకమ్మ పండుగకు మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలి:

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్ (ప్రశ్న న్యూస్):** హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ పండుగ ఏర్పాట్లను, చెరువు సుందరీకరణ పనులను, చెరువు కట్టపై నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ ఆలయ పనులను ఆయన పరిశీలించారు.బతుకమ్మ ఘాట్ మెట్ల వద్ద మాత్రమే కాకుండా, చెరువు వైపు ఇతర ప్రాంతాల్లో కూడా అవసరమైన చోట్ల బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మహిళలు, కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆరేపల్లి చెరువు వద్ద కూడా బతుకమ్మ వేడుకల కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, ఆర్డీవో రామ్మూర్తి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588